

నేడు మంత్రి లోకేశ్ రాక



విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి నగరానికి రానున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి వెళ్లి బస చేస్తారు. ఈనెల 12వ తేదీన రుషికొండ ఐటీ హిల్స్‌పై ఆరు సంస్థలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కాపులుప్పాడలో కాగ్నిజెంట్ కంపెనీ భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతారు.

పరిశ్రమల కోసం

5,000 ఎకరాల సమీకరణ

- విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటు నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశం
- వీఎంఆర్‌డీఏకు బాధ్యతలు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటు నేపథ్యంలో పరిశ్రమల కోసం జిల్లాలో ఐదు వేల ఎకరాలు సమీకరించనున్నారు. ఇందుకోసం డీపట్టా, ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. భూసమీకరణ బాధ్యతను వీఎంఆర్‌డీకు జిల్లా కలెక్టర్ అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విశాఖ పరిసర మండలాల్లో ఇప్పటికే 1,000 ఎకరాల వరకూ సమీకరణకు వీఎంఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోంది. మిగిలిన నాలుగు వేల ఎకరాల సమీకరణ కోసం ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో 11 మండలాలు ఉన్నా ... మిగతా 8వ పేజీలో

ఆర్టీసీలో జోష్

స్త్రీశక్తి పథకం అమలుతో విపరీతంగా పెరిగిన ప్రయాణికుల సంఖ్య

- గతంలో రోజుకు 2.3 లక్షల మంది ప్రయాణం
- ఇప్పుడు 4.18 లక్షలు...
- ఆక్యుపెన్సీ 66 నుంచి 96 శాతానికి...
- ఆదాయం రూ.95 లక్షల నుంచి రూ.1.35 కోట్లకు ...



ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న మహిళలు

ద్వారకా బస్‌స్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
విశాఖ రీజియన్‌లో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) దాదాపు 96 శాతం నమోదవుతోంది. అందుకు తగ్గట్టుగా ఆదాయం వస్తోంది. ఇందుకు 'స్త్రీశక్తి' పథకమే కారణమని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 15న స్త్రీశక్తి పథకం ప్రారంభించింది. ఆ మరుసటిరోజు నుంచే ఓఆర్ పెరుగుతూ వచ్చింది.

రీజియన్‌లోని మధురవాడ, వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, గాజువాక, స్టీల్ సిటీ, సింహాచలం డిపోల పరిధిలో 700 బస్సులు నడుస్తున్నాయి. స్త్రీశక్తి పథకం అమలుకు ముందు ప్రతిరోజు సగటున 2.3 లక్షల మంది ప్రయాణించేవారు. ఆక్యుపెన్సీ రేషియో 66 శాతంగా నమోదయ్యేది. సగటున రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు వచ్చేది. స్త్రీశక్తి పథకం అమలు తరువాత రోజువారీ ప్రయాణికుల సంఖ్య 4.18 లక్షలకు పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియో 96 శాతానికి, ఆదాయం రూ.1.35 కోట్లకు పెరిగాయి.

స్త్రీశక్తి ప్రయాణికులు 74 శాతం

స్త్రీశక్తి పథకం అమలుకు ముందు ఆర్టీసీ బస్సుల్లో 2.3 లక్షల మంది ... మిగతా 8వ పేజీలో

ఉక్కు సీఎండీ ఎంపికపై సందిగ్ధం

నెలాఖరుకు ముగియనున్న ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా పదవీకాలం

- పూర్తిస్థాయి సీఎండీ నియామకం కోసం ఇప్పటివరకూ ప్రారంభం కాని ప్రక్రియ
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టులు కూడా ఖాళీ
- తాజాగా సీవీఓ, ఫైనాన్స్ డైరెక్టర్ మాత్రం నియామకం



విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
స్టీల్ ప్లాంటును కష్టాల నుంచి గట్టెక్కించడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తున్నామని చెబుతున్న ఉక్కు మంత్రిత్వ శాఖ కీలకమైన పోస్టులను మాత్రం భర్తీ చేయకుండా కాలయాపన చేస్తోంది. ప్రత్యేక అవసరాల కోసం ఎంఓఐఎల్ నుంచి డిప్యూటేషన్‌పై తీసుకువచ్చిన సీఎండీ ఏకే సక్సేనా పదవీకాలం ఈ నెలాఖరుతో ముగుస్తుంది. కానీ, ఇప్పటివరకూ పూర్తిస్థాయి సీఎండీ నియామకం కోసం ... మిగతా 8వ పేజీలో

విమానాశ్రయంలో కంట్రోల్ రూమ్

ప్రయాణికులకు 24 గంటలూ సమాచారం అందించేందుకు ఏర్పాట్లు

- 2, 3 రోజుల్లో పూర్తిస్థాయిలో విమానాల రాకపోకలు
- విమానాశ్రయం డైరెక్టర్ ఎన్.పురుషోత్తం

గోపాలపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
మరో రెండు, మూడు రోజుల్లో విమాన సర్వీసులు పూర్తిస్థాయిలో నడిచే అవకాశం ఉందని విశాఖపట్నం విమానాశ్రయం డైరెక్టర్ ఎన్.పురుషోత్తం అన్నారు. ఆయన బుధవారం విమానాశ్రయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ విమాన సర్వీస్‌ల రద్దుపై పత్రికా ముఖంగా ముందస్తు సమాచారం అందిస్తున్నామని, విమానాలు ఆలస్యమైతే ప్రయాణికులకు అన్ని సదుపాయాలు విమానాశ్రయంలో కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం విమానాశ్రయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశామని, 24 గంటలు ప్రయాణికులకు సమాచారం అందించడం కోసం డ్యూటీ టెర్మినల్ మేనేజర్‌ను నియమించామని పేర్కొన్నారు.

విశాఖ విమానాశ్రయం నుంచి ఈ నెల 3న 31 విమానాలు రాకపోకలు సాగించాల్సి ఉండగా 3 విమాన సర్వీసులు రద్దయ్యాయని తెలిపారు. ఈ నెల 4న ఏడు విమానాలు, 5న 15, 6న 9, 7న 10, 8న 8, 9న ఏడు, 10 (బుధవారం)న ఐదు విమాన సర్వీసులు రద్దయినట్టు వెల్లడించారు. ఈ నెల 7 నుంచి విమాన సర్వీసుల రద్దు కాస్త తగ్గిందన్నారు. రద్దయిన సర్వీసుల్లో అధిక శాతం ఇండిగో విమానాలే ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న విమానాశ్రయ డైరెక్టర్ ఎన్.పురుషోత్తమ్

ఐదు ఇండిగో విమాన సర్వీస్‌లు రద్దు

గోపాలపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
విశాఖ విమానాశ్రయం నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లాల్సిన ఐదు ఇండిగో విమాన సర్వీసులు బుధవారం సాంకేతిక కారణాలతో రద్దయ్యాయి. వీటిలో విశాఖ-బెంగళూరు, విశాఖ-చెన్నై, విశాఖ-హైదరాబాద్, విశాఖ-ఢిల్లీ, విశాఖ-హైదరాబాద్ సర్వీస్‌లు ఉన్నాయని అధికారులు తెలిపారు. కాగా గురువారం ఆరు సర్వీసులు రద్దు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. వీటిలో హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, బెంగళూరు-విశాఖ-బెంగళూరు, చెన్నై-విశాఖ-చెన్నై, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, ఢిల్లీ-విశాఖ-హైదరాబాద్, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్ విమాన సర్వీసులున్నాయి.



అపార్టుమెంట్ నుంచి మంటలు

అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

- అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో తప్పిన పెనుప్రమాదం

విశాఖపట్నం/ఆర్కే బీచ్‌రోడ్డు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
నగరంలోని ఆర్కే బీచ్‌రోడ్డులో నోవాటెల్ హోటల్ పక్కనున్న ఫార్చ్యూన్ బీచ్ ఫ్రంట్ అపార్టుమెంట్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. తొమ్మిదో అంతస్థులో గల ఫ్లాట్ నంబర్ 905లో వృద్ధ మహిళ ఒక్కరే ఉంటున్నారు. ఉదయం ఏడు గంటల సమయంలో పూజ చేసిన తర్వాత ఆమె బెడ్‌రూమ్‌లోని కిటికీ వద్ద ... మిగతా 8వ పేజీలో

జీవీఎంసీ స్థలం కబ్జా

34వ వార్డులో పార్కు పక్కనున్న వెయ్యి గజాలు ఆక్రమణ

- అధికారులకు పలుమార్లు స్థానికుల ఫిర్యాదు
- అయినా చర్యలు శూన్యం
- సుమారు రూ.ఐదు కోట్లు ఉంటుందని అంచనా



ఆక్రమిత స్థలానికి కాంపౌండ్‌వాల్ నిర్మించి గేట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
జీవీఎంసీకి చెందిన విలువైన స్థలాలు ఒక్కొక్కటిగా అన్యాక్రాంతమైపోతున్నాయి. తాజాగా 34వ వార్డు పరిధిలో రామకృష్ణా పార్కును ఆనుకుని ఉన్న సుమారు వెయ్యి గజాల స్థలాన్ని కొందరు ఆక్రమించి అద్దెకు ఇచ్చారంటూ స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అయినా చర్యలకు మీనమేషాలు లెక్కిస్తుండడం అనుమానాలకు దారితీస్తోంది.

జీవీఎంసీ 34వ వార్డులో రామకృష్ణా రైతు బజార్ సమీపాన నగర పాలక సంస్థకు పార్కుతోపాటు మరికొంత స్థలం ఉంది. పార్కు పక్కనున్న స్థలం పరిరక్షణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారు. స్థానికంగా పలుకుబడి కలిగిన ఒక రాజకీయ నాయకుడు ఆ స్థలంలో 330 గజాలను తాను కొనుగోలు చేశానని ప్రకటించుకున్నారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి కావడంతో ఎవరూ పత్రాలు చూపించాలని అడిగే సాహసం చేయలేదు. తర్వాత తాను కొనుగోలు చేసినట్టు చెప్పిన ... మిగతా 8వ పేజీలో

టెట్‌కు 91.05% హాజరు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని ఐదు కేంద్రాల్లో బుధవారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. తొలిరోజు మొత్తం 2,001 మంది అభ్యర్థులకుగాను 1,822 మంది (91.05 శాతం) హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈనెల 21వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 26,248 మంది టెట్‌కు సంబంధించి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరి కోసం నగరంలో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఐదు కేంద్రాల్లోనే పరీక్ష నిర్వహించారు.

రెవెన్యూ రికార్డుల తారుమారుపై విచారణ

జేసీ ఎదుట హాజరైన నలుగురు డిప్యూటీ కలెక్టర్లు, నలుగురు డీటీలు

- భీమిలి తహశీల్దారు కార్యాలయంలో ఏసీబీ దాడులపైనా విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):
విశాఖ రూరల్ మండలం మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెంలో గల ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల తారుమారు వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ విచారించారు. 2004 నుంచి 2007 వరకూ కలెక్టరేట్‌లో 'ఎఫ్' సెక్షన్ సూపరింటెండెంట్లుగా పనిచేసిన పి.ధర్మచంద్రారెడ్డి, డి.అనిత, ప్రమీలాగాంధీ, కె.సుబ్బారావు (ప్రస్తుతం వీరంతా డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్నారు), టైపిస్టులుగా పనిచేసిన బి.రవికుమార్, ఆర్వీ మురళీధర్ (ప్రస్తుతం డిప్యూటీ తహశీల్దార్లుగా ... మిగతా 8వ పేజీలో

కమనీయం..అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి అర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

'పరీక్షా పే చర్చ'పై అవగాహన



మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ అల్లాఉద్దీన్

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రధానితో మాట్లాడే పరీక్షా పే చర్చ కార్యక్రమంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల సీనియరు లెక్చరర్ ఎస్కే అల్లావుద్దీన్ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా పే చర్చ యాప్‌పై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవ నైపుణ్యాలు, పరీక్ష సన్నద్ధత, కెరీర్ గైడెన్స్, ఇతర ప్రశ్నలపై నచ్చిన అంశాన్ని ఎంచుకుని 500 అక్షరాలతో ఒక ప్రశ్నపై ప్రధాని మోదీతో ముఖాముఖిగా మాట్లాడే అరుదైన అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుందన్నారు. దీనికి 6 నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. యాప్ ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉందన్నారు. ఏవిధంగా ఆన్‌లైన్ చేసుకోవాలన్న విషయమై డైట్ సీనియర్ లెక్చరర్ ఎం. వెంకటరమణ వివరించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వచ్చే నెల 11 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. కె. సోమశేఖర్

తగరపువలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :మానవ హక్కులను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని మానవ హక్కుల ఉద్యమ నేత, విశ్రాంత ప్రిన్సిపాల్ డా. కె. సోమశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక హక్కులు, మానవ హక్కులు, రాజ్యాంగపరమైన హక్కులకు మధ్య తేడా ఉందన్నారు. మానవ హక్కులకు భంగం కలగని ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని, ప్రతిఒక్కరూ హక్కులను పరిరక్షించుకోవడానికి ప్రయత్నించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డా పి. శ్రీవాణి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే హక్కుల గురించి తెలుసుకోవాలని హక్కులతో పాటు బాధ్యతల్ని కూడా విస్మరించరాదని సూచించారు. అనంతరం కళాశాల సిబ్బంది సోమశేఖర్‌ను సన్మానించారు.

50 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఎండాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడలో ఉన్న శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో గొల్లల ఎండాడలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు 50 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యకమంలో సిమ్స్ డైరెక్టర్ వి. సాయి ప్రశాంత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జి. సుధాకర్, గొల్లల ఎండాడ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంతకాల పత్రాలతో వైసీపీ నిరసన

తగరపువలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన సంతకాల పత్రాలతో వైసీపీ నాయకులు తగరపువలసలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టి, అక్కడి నుంచి వాహనాల్లో నగరా నికి వెళ్లి పత్రాలను పెట్టెలను పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు అందజేశారు. కార్యక్రమంలో పలు వార్డులకు చెందిన అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో కంట్రోల్ రూమ్

... 7వ పేజీ తరువాయి

ఉన్నాయన్నారు. ఆ విమానాలకు సంబంధించి లగేజీని ప్రయాణికులకు అప్పగించే చర్యలు ఆ సంస్థ చేపట్టిందని, కొంతమందికి నేరుగా ఇళ్లకు పంపించే ఏర్పాటుచేసిందని తెలిపారు. విశాఖ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ సుమారు 8 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ సంఖ్య 30 శాతం మేర తగ్గిందన్నారు.

రెవెన్యూ రికార్డుల తారుమారుపై విచారణ

... 7వ పేజీ తరువాయి

పనిచేస్తున్నారు), కె.విజయభాస్కర్ (ప్రస్తుతం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు) రికార్డుల ట్యాంపరింగ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జేసీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు విచారణకు హాజరుకావాలని ఐదారు నెలల క్రితమే ఏడుగురినీ జేసీ ఆదేశించారు. అయితే యోగాంధ్ర, ఆ తరువాత వర్షాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. మంగళవారం జేసీ చేపట్టిన విచారణకు వీరంతా హాజరై వాంగ్మూలం అందజేశారు. మరిన్ని వివరాల కోసం మరోసారి విచారణ చేపట్టనున్నారు. ఇదిలావుండగా భీమిలి తహశీల్దారు కార్యాలయంలో 2020లో అవినీతి నిరోధక శాఖాధికారులు చేపట్టిన ఆకస్మిక దాడులకు సంబంధించి విచారణ బాధ్యతను జేసీకి ప్రభుత్వం అప్పగించింది. దీనికి అనుగుణంగా అప్పటి తహశీల్దారు, మరో 20 మంది సిబ్బంది విచారణకు హాజరయ్యారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధమవ్వండి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- నియోజకవర్గంలోని మండలాల నాయకులతో సమీక్ష సమావేశం



భీమిలి మండల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధమవ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఏకపక్ష విజయానికి అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టిసారించాలన్నారు. మూడు మండలాల్లో 18 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక సమస్య వల్ల తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలెండర్లు, వాహన మిత్ర తదితర పథకాల నగదు కొందరి అకౌంట్‌లకు జమ కావడం లేదని నాయకులు గంటా దృష్టికి తీసుకువచ్చారు. అలాగే స్పౌజ్ పెన్షన్‌లు అందజేస్తున్నప్పటికీ కొత్త పెన్షన్‌లకు కూడా అధికంగానే వినతులు అందుతున్నాయని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆ పార్టీ నాయకులు కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పద్మనాభం మండల నేతలు తెలిపారు. గ్రామ సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయం సిబ్బందిలో కొందరు వైసీపీకి సహకరిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. సమర్థులైన సిబ్బందిని కలెక్టరేట్, జిల్లా పరిషత్‌కు డెప్యూటేషన్‌పై తీసుకువెళ్లడంతో పనులు త్వరితగతిన జరగకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అనంతరం గంటా మాట్లాడుతూ ప్రధానమైన సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషి చేస్తామన్నారు. ప్రతి నెలా జరిగే సమావేశాలకు నాయకులు వరుసగా మూడు నెలలు గైర్హాజరైతే ఆయా పదవులకు అనర్హులవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ఎస్. అప్పారావు, కె. రమణ, టి. అప్పారావు, నాయకులు చిక్కాల విజయబాబు, డీఏఎన్ రాజు, బీఆర్‌బీ నాయుడు, కె.దామోదరావు, కె.నగేశ్ కుమార్, కె. లీలావతి, ఎం. నందీష్, బి. ఉమ, కె. శ్రీకాంత్, అనిల్‌ప్రసాద్, జి.సోమినాయుడు, కుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తాం

వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):అనధికార లే అవుట్లలో స్థలాల కొనుగోలుదారులు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్. తేజ్‌భరత్ సూచించారు. వీఎంఆర్డీఏ పరిధిలోని ఎంపీడీవోలు, నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్లు, ఎల్‌టీపీలతో బుధవారం సమావేశమయ్యారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్‌ఎస్), బిల్డింగ్ పైనలేజేషన్ స్కీమ్(బీపీఎస్) పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు కచ్చితంగా దరఖాస్తు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఎల్‌టీపీలు తీసుకోవాలన్నారు. ఈనెల 20 వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి, అనధికార లేఅవుట్లు, అనుమతుల్లేని నిర్మాణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు 2026 జనవరి 23 వరకు గడువు పొడిగించారన్నారు. స్థల యజమానులకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు.

13న లోక్ అదాలత్

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కోర్టులో ఈనెల 13న లోక్ అదాలత్ జరగనున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్‌ప్రిన్సిపల్ జూనియరు సివిల్ జడ్జి డి. సౌజన్య తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న, రాజీకి అవకాశం ఉన్న కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ట్రాఫిక్ చలానా కేసులను కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. అలాగే మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కూడా భీమిలి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కొమ్మాది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎంపాలెం పోస్టాఫీసు వద్ద రూ.7.50 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు వార్డు టీడీపీ అధ్యక్షుడు గరే గురునాథ్ బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ జీవన్ కుమార్, లొడగల జానకీరామ్, వరపుల రమేశ్, ఆరో వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ,శ్రావణ్‌కుమార్, సుధీర్, పోలిశెట్టి నాగేశ్వరరావు, పోతినాయుడు, షేక్ జహనరా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు, పురోహితుడు సునరాపు కామేశ్వర మాధవ శాస్త్రి తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కన్వెన్షన్ సెంటర్ నిర్వాహకుడు చెన్న వెంకటేశ్ ఆర్థిక సహకారంతో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ కార్యదర్శి మునునూరి సూర్య శ్రీనివాసరావు, కోశాధికారి మొకర నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు తడి పంటలతో మేలు : ఏఓ

పద్మనాభం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో రైతులు ఆరు తడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఓ ఎంవీ చలం సూచించారు. బుధవారం ఆయన అనంతవరం, పెంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరికి బదులు ఆరుతడిపంటలైన చోడి, మొక్కజొన్న, పెసర, మినుములు పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయని చెప్పారు. రాగులు వేస్తే క్వింటాకు మద్దతు ధర రూ. 4886 ఉందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రాగుల విత్తనాలు రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ధాన్యం విక్రయించాలనుకునే రైతులు ఆర్‌బీకే కేంద్రాల వద్ద తొలుత పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతాయన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక

భీమునిపట్నం/కొమ్మాది, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని ది సన్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న చెట్ల కార్తీక్ ఎంపికయ్యాడని పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు జిల్లా పల్నాడులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో కార్తీక్ ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈమేరకు ఈనెల 12 నుంచి 16 వరకు హరియాణ, పానిపట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నాడు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు కార్తీక్‌ను అభినందించారు. అలాగే ఇదే పోటీల్లో 17 ఏళ్ల బాలుర విభాగంలో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాత్విక్ బంగారు పతకం గెలుపొందాడు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సాత్విక్‌ను పాఠశాల హెచ్‌ఎం ములుగు వెంకట్రావు, ఉపాధ్యాయుడు లలిత్‌కుమార్, తదితరులు అభినందించారు.

సంగివలసలో త్రుటిలో తప్పిన ప్రమాదం

తగరపువలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస వద్ద అపార్టుమెంటులోని ప్లాట్‌లో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు అప్రమత్తం కారణంతో పెను ప్రమాదం తప్పింది. సంగివలసలోని మార్వెల్ అపార్టుమెంటులో 90 ప్లాట్లు ఉన్నాయి.316వ ప్లాట్‌లో మహిళ వాషింగ్ మిషన్ వేయగా విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

ఉక్కు సీఎండీ ఎంపికపై సందిగ్ధం

... 7వ పేజీ తరువాయి

ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వాస్తవానికి మూడు నెలల ముందే కమిటీ ఈ ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. సీఎండీ లేకుండా ఇంత పెద్ద సంస్థను ఇన్‌చార్జులతో ఎంత కాలం నడుపుతారో అర్థం కాని పరిస్థితి. నలుగురు డైరెక్టర్లలో ఇద్దరు లేరు. ఇప్పుడు సెయిల్‌లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్‌ను ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆయన ఐదేళ్లు ఈ పదవిలో ఉంటారు. పర్సనల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. ఎన్‌టీపీసీ అధికారిని ఎంపిక చేసి నెల రోజులు దాటినా ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదు. చీఫ్ విజిలెన్స్ అధికారిగా సెయిల్‌లో పనిచేస్తున్న సీవీఓ సత్యనారాయణ గుప్తాకు అదనపు బాధ్యతలు ఇస్తూ బుధవారం ఆదేశాలు ఇచ్చారు. ఏడాది కాలానికే ఉత్తర్వులు వచ్చాయి. ఇవి కాకుండా ప్లాంటులో కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి 15 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఉండేవారు. వారిలో పదోన్నతులు వచ్చి కొందరు, పదవీ విరమణ చేసి కొందరు వెళ్లిపోగా నాలుగేళ్ల నుంచి నియామకం చేపట్టలేదు. జనరల్ మేనేజర్ పోస్టులు కూడా దాదాపు సగం ఖాళీగా ఉన్నాయి. వాటినీ భర్తీ చేయలేదు.

అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ పెంచి, 100 శాతం ఉత్పత్తి సాధించాలని ప్రయత్నిస్తున్న ఉక్కు మంత్రిత్వ శాఖ తాత్కాలిక అధికారులతో ఎందుకు ప్రయోగాలు చేస్తున్నదో రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించడం లేదు. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఇటీవల కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి పూర్తిస్థాయి బోర్డును నియమించాలని కోరిన పది రోజులకు ఈ రెండు పోస్టులను భర్తీ చేయడం కొంత ఊరట కలిగించింది. మిగిలిన పోస్టులు కూడా తక్షణమే భర్తీ చేస్తే కేంద్రం ఆశించిన ప్రగతి సాధ్యమవుతుంది.

ఆర్టీసీలో జోష్

... 7వ పేజీ తరువాయి

ప్రయాణిస్తే అందులో పురుషులు 52 శాతం ఉంటే మహిళలు 48 శాతం ఉండేవారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు రోజువారీ మొత్తం ప్రయాణికుల సంఖ్య 4.18 లక్షలు ఉంది. అందులో స్త్రీశక్తి మహిళా ప్రయాణికుల సంఖ్య 3.1 లక్షలుగా నమోదయ్యింది. మొత్తం ప్రయాణికుల్లో ఇది 74 శాతం. జీరో టికెట్ ఇష్యూ ప్రకారం అధికారులు ఈ లెక్కలు తేల్చారు. స్త్రీశక్తి పథకానికి సంబంధించిన ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసులో కొన్నిమార్లు 120 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతున్నదని అధికారులు తెలిపారు. విశాఖ నుంచి శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పాతపట్నం, విజయనగరం, సాలూరు, బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు రాకపోకలు సాగించే స్త్రీశక్తి బస్సులు రోజంతా వంద శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తున్నాయని అధికారులు తెలిపారు.

అంచనాకు మించి పెరిగిన ఆదాయం

స్త్రీశక్తి పథకం అమలు తరువాత అధికారుల అంచనాకు మించి ఆదాయం పెరిగింది. పథకం అమలుకు ముందు సగటున రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు వచ్చేది. పథకం అమలు తరువాత సగటున రూ.1.35 కోట్లుగా నమోదవుతున్నది. రూ.1.25 కోట్లు ఆదాయం నమోదుకాగలదని అధికారులు అంచనా వేశారు. వారి అంచనాకు మించి అధికంగా ఆదాయం నమోదవుతున్నట్టు అధికారులు వెల్లడించారు.

రోజువారీ కలెక్షన్ రూ.40 లక్షలు

ఆర్టీసీకి రోజువారీ ఆదాయం రూ.1.35 కోట్లుగా నమోదవుతున్నా, నగదు రూపంలో వచ్చేది రూ.40 లక్షలు. మిగిలిన రూ.95 లక్షలు స్త్రీశక్తి పథకం ద్వారా ప్రయాణించిన మహిళలకు సంబంధించినది. ఈ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. ఆగస్టు 15 నుంచి అక్టోబరు నెలాఖరు వరకూ ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు చెల్లించాల్సిన మొత్తంలో రూ.40 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

నరసాపురంలో పారిశుధ్య లోపం

పద్మనాభం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తునివలస పంచాయతీ శివారు నరసాపురంలో పారిశుధ్యం క్షీణించింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కనిపిస్తున్నాయి. కాలువలు పూడికలతో నిండిపోయాయి. తాగునీటి వనరుల చుట్టూ మురుగు నీటి నిల్వలు పేరుకుపోయాయి. దోమలు వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నెలలు తరబడి పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజా సమస్యలపై దృష్టిసారించండి

- అధికారులకు ఎమ్మెల్యే గంటా ఆదేశం

భీమునిపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందే ప్రతి వినతిని పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని బీచ్ రోడ్‌లో వున్న క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఎక్కడో ఒకచోట తాను పాల్గొంటానన్నారు. రాలేని పరిస్థితిలో మంగళవారం నుంచి శుక్రవారంలోపు మండల కార్యాలయాల్లో గాని, జోనల్ కార్యాలయంలో గాని ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తానని తెలిపారు. శ్మశాన వాటికలో సదుపాయాలు, కాలువల నిర్మాణం, దివ్యాంగ పెన్షన్లు, జల్ జీవన్ మిషన్ పనులు, జిరాయితీ భూమిలో ఇళ్ల నిర్మాణంపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయని, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఈనెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ పర్యటన అనంతరం మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో జోన్ల పునర్వ్యవస్థీకరణపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పైల రామారావు, జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు, జోన్ డీఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పద్మనాభం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామీణ ప్రాంతాలు, మురికివాడల్లో అవగాహన కల్పించాలని విశాఖ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు కేవీ రామలక్ష్మి చెప్పారు. రేవిడి గ్రామంలో బుధవారం బాల్య వివాహాల విముక్త్ భారత్ కార్యక్రమంపై మహిళా శిశు సంక్షేమ శాఖ ధాత్రి ఫౌండేషన్, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాయన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చేపడుతున్న కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూపాకుల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రవికుమార్, హెచ్‌ఎం వి. శంకరరావు, కూటమి నాయకులు ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాస్, హంస మహేష్, కాళ్ల నగేష్, గంగరాజు, అప్పలనాయుడు, రిటైర్డు ఎంపీడీఓ బాపిరాజు, వైసీపీ నాయకులు మరగడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎన్జీవో నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా భవన్‌లో బుధవారం 23 మంది నామి నేష న్‌లు దాఖలు చేశారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ మాత్ర మే రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఏవీఎస్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. అధ్యక్షుడిగా వై. నారా యణరావు, కార్యదర్శిగా జి. చంద్రరావు, కోశాధికారిగా డి. రామారావు, నగేష్ పట్నాయక్, పి. ఆనంద్‌రెడ్డి, డి. శ్రీనుబాబు, జి. రామ్ ప్రసాద్, పి. భవాని ఎన్నికయ్యారు.

పరిశ్రమల కోసం 5,000 ఎకరాల సమీకరణ

... 7వ పేజీ తరువాయి

ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాల్లో మాత్రమే ప్రభుత్వ భూములతోపాటు కొంతమేర డీపట్టా భూములు, కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. గాజువాక, పెదగంట్యాడ, విశాఖ రూరల్, గోపాలపట్నం మండలాల్లో ప్రభుత్వ భూములు దాదాపు లేవు. మిగిలిన మండలాలు నగరంలో ఉన్నాయి. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కాలనీల కోసం నాలుగు వేల ఎకరాలు వరకూ సమీకరించింది. ఎంఐజీ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ఐదారు వందల ఎకరాలు కేటాయించింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం డీపట్టా భూములు సేకరించింది.

అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

... 7వ పేజీ తరువాయి

దీపం ఉంచి ఇంట్లో పనులు చూసుకుంటున్నారు. గాలికి దీపం ఎగిరి కిందపడడంతో వాల్ కర్టెన్‌కు నిప్పంటుకుంది. దీంతో మంటలు ఆ గదితోపాటు పక్కనే ఉన్న గదికి వ్యాపించాయి. పొగ బయటకు రావడంతో అపార్టుమెంట్‌వాసులు గుర్తించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అగ్నిమాపక శకటాలతోపాటు ఎత్తైన భవనాల పైకి వెళ్లి మంటలను ఆర్పే సదుపాయం కలిగిన బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనంతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ఆర్ఎఫ్ఓ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తమకు సకాలంలో సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అపార్టుమెంట్‌లో ఉన్న అగ్నిమాపకపరికరాల సహాయంతో మంటలను అదుపు చేయగలిగామన్నారు. ఒంటరిగా ఉంటున్న మహిళ దీపం పెట్టడం, గాలికి ఎగిరిపడడం కారణంగానే ప్రమాదం సంభవించిందని భావిస్తున్నట్టు తెలిపారు.

అపార్టుమెంట్‌లో ఉన్న అగ్నిమాపక వ్యవస్థ బాగానే పనిచేస్తోందని కితాబిచ్చారు. ఈ సమాచారం తెలియగానే సీపీ శంఖబ్రతబాగ్చి అపార్టుమెంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్‌లో అగ్నిమాపక పరికరాలు ఉన్నప్పటికీ అవన్నీ కాలంచెల్లినవిగా గుర్తించామన్నారు. పైగా అగ్నిప్రమాదం జరిగితే వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై అపార్టుమెంట్ వాసులకు సరైన అవగాహన లేదన్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో నగరంలోని బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటిని వినియోగించడంపై ప్రజలకు అవగాహనపై ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించామన్నారు.

జీవీఎంసీ స్థలం కబ్జా

... 7వ పేజీ తరువాయి

స్థలానికి, పార్కుకు మధ్యలో ఉన్న జీవీఎంసీకి చెందిన సుమారు వెయ్యి గజాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ స్థలం విలువ ఇప్పుడు మార్కెట్‌లో దాదాపు రూ.ఐదు కోట్లు ఉంటుందని అంచనా. తర్వాత ఆ స్థలం అంతటినీ వేరొకరికి అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇటీవల జనసేనకు చెందిన ఒక కార్పొరేటర్ జీవీఎంసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకుని అద్దెకు ఇచ్చినట్టు పేర్కొంటూ ఆధారాలతో జీవీఎంసీ కమిషర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి జీవీఎంసీకి చెందిన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయినా ఇంతవరకూ దీనిపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రూ.కోట్లు విలువైన జీవీఎంసీ స్థలాన్ని పరిరక్షించాలని ఆధారాలతో స్థానికులు పోరాడుతున్నాసరే అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆకతాయిల అడ్డాగా పార్కు



గేటు, గ్రిల్స్ ఏర్పాటుకు నోచుకోని ప్రహరీ

మద్దిలపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ పార్కుకు రక్షణ కరువైంది. పార్కు ప్రహరీకి గేట్లు, పైన ఇనుప ఊచలు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆకతాయిలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. పిఠాపురం కాలనీ పార్కుకు రక్షణగా గోడ నిర్మాణం చేపట్టి గేట్లు ఏర్పాటు చేశారు. బాగున్న ప్రహరీని విరగ్గొట్టి నూతన గోడ నిర్మాణానికి రూ.26 లక్షలతో పనులు చేపట్టారు. పది నెలల కిందటే ఉన్న ప్రహరీని తొలగించి కొత్త ప్రహరీ నిర్మాణం చేశారు. నాలుగు అడుగుల ఎత్తులో ప్రహరీ, రెండు అడుగుల ఇనుప ఊచలు, ముందుకు గేటు ఏర్పాటు చేయాలి. కాగా నాలుగు అడుగుల ప్రహరీని మాత్రం నిర్మించి ఇనుప ఊచలు, గేటు అమర్చలేదు. దీంతో చీకటి పడితే గంజాయి బాబులు పార్కు లోపల తిష్ట వేస్తున్నారు. మద్యం, గంజాయి సేవిస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రహరీకి ఊచలు, గేటు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని స్థానికులుకోరుతున్నారు.

లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణ మంజూరు పత్రాలను ఆయా ప్రాంతాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం వాసవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 18, 19 వార్డుల పరిధిలోని వాసవానిపాలెం, పెదజాలారిపేట, జాలారి ఎండాడ, శివగణేష్ నగర్ ప్రాంతాల్లోని మత్స్యకారులు 85 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ పీఎంఏవై పథకంలో ఒక సెంటు భూమి కేటాయించిన పత్రాలు, ఇప్పటికే స్థలం ఉన్నవారికి గృహ నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలను అందించారు. కేంద్రం వాటా రూ.1.5 లక్షలు, రాష్ట్ర వాటా రూ.లక్ష కలిపి రూ. 2.5 లక్షలు మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పోతనరెడ్డి, గొలగాని పోలారావు, ఓలిశెట్టి గురునాథం, బాపిరాజు, గణేష్, మత్స్యకార గ్రామాల పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవేంకటేశ్వర వైభవం



విభీషణ శర్మ ప్రవచనం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ గోవింద నామస్మరణతో పులకించింది. ఆరో సెక్టరు భద్రం కమ్యూనిటీ హాలు ఆవరణలో బుధవారం నుంచి శ్రీ వేంకటేశ్వర వైభవం మొదలైంది. రుషిపీఠం విశాఖపట్నం సత్సంగ్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, తిరువీధి ఉత్సవం, సహస్ర దీపాలంకరణ, నాద నీరాజనం, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి శ్రీవారి భక్త బృందాలు పాల్గొన్నాయి. చిన్నారుల సంకీర్తనలు, అన్నమాచార్య కృతులు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. సాయంత్రం శ్రీవేంకటేశ్వర వైభవంపై ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ ప్రవచనం ఆకట్టుకుంది.

26న రంగానాడు బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలాజీ తదితరులు

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26న నగరంలోని ఆర్కే బీచ్ వద్ద రంగానాడు భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్టు రాధా రంగ రాయల్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు గాదె బాలాజీ తెలిపారు. ఆశీల్‌మెట్టలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులతో కలసి ఆయన బహిరంగ ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా 37వ వర్ధంతి సందర్భంగా నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రంగా అభిమానులు విశాఖకు తరలిరానున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, వంగవీటి రంగా అభిమానులతో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బహిరంగ సభలో పది అంశాలను ప్రధాన అజెండాగా భవిష్యత్ కార్యక్రమాలకు సన్నద్ధమౌతున్నట్టు తెలిపారు. ఇందులో కృష్ణా జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలనే డిమాండ్ ఉందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా రంగా అంటే అభిమానించేవారు నేటికీ ఉన్నారన్నారు. 26 సాయంత్రం జరుగబోయే బహిరంగ సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సుధాకర్ నాయుడు, గుడివాడ ప్రభాకర్, శ్రీనివాసరావు, కేవీపీఎస్ భాస్కర్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలోని వ్యక్తే బైక్ చోరీ నిందితుడు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఎంవీపీ పోలీసులు నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. గతనెల 23న ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులోని డీఎల్ఎక్స్ హాస్టల్ వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాహన యజమాని చంద్రశేఖర్ రాపిడో డెలివరీ బాయ్‌గా పని చేస్తుంటాడు. చంద్రశేఖర్ నిద్రపోతున్న సమయంలో వసతి గృహంలోనే ఉంటున్న మరో యువకుడు ఏరుబండి శ్రీరాజ్ అతడి జేబులో నుంచి బైకు తాళాలు దొంగలించాడు. అలాగే చంద్రశేఖర్ ఫోన్ తీసుకొని ఫోన్ ద్వారా వసతి గృహం అద్దె కూడా చెల్లించి బైకుతో పరారయ్యాడు. విచారణ జరిపిన ఎంవీపీ పోలీసులు నిందితుడిని బైకుతో సహా బుధవారం అరెస్టు చేశారు. నిందితుడు గుంటూరు టౌన్‌కు చెందిన వ్యక్తిగా ద్వారకా సీఐ చక్రధరరావు తెలిపారు.

విస్తృతంగా డ్రంకన్, డ్రైవ్ తనిఖీలు



హనుమంతవాక జంక్షన్‌లో డ్రంకన్, డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు.

ఆరిలోవ, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బుధవారం సాయంత్రం వాహన చోదకులపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు, కార్లపై వెళ్లే వాహనదారులకు ఈ పరీక్షలనువిస్తృతంగా చేపట్టారు.

తక్కువ ధరకు భూముల లీజు వ్యవహారంపై విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు భూములు లీజుకు ఇచ్చిన వ్యవహారంపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. మర్రిపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీవల్లి షిప్పింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థకు నామమాత్రపు ధరతో భూమిని లీజుకు కేటాయించారు. దీనిపై అప్పటి జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం (రిటైర్డ్ జేడీ) వీఆర్‌వీఆర్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ ఆర్.సత్యారావు (రిటైర్డ్)పై విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ అంశంపై విచారణకు గతంలో అడిషనల్ డైరెక్టర్ ఏవీ పటేల్‌ను నియమించగా, తాజాగా ఆ బాధ్యతలను అడిషనల్ డైరెక్టర్ ఎ.సుధాకర్‌కు అప్పగించి, గడువులోగా విచారణ నివేదిక అందజేయాలని సూచించింది.

ఏయూలో ఘనంగా 'కట్టమంచి' జయంతి



కట్టమంచి రామలింగారెడ్డికి నివాళులు అర్పిస్తున్న అచార్యులు, విద్యార్థులు

సీతంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖలో మాజీ వీసీ కట్టమంచి రామలింగారెడ్డి 145వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అడ్డాడ నరసింహారావు తదితరులు కట్ట రామలింగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జర్రా అప్పారావు మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం', 'నవ యామిని', 'కవిత్వ తత్త్వవిచారం', 'పంచమి', 'వ్యాసమంజరి', 'అర్థశాస్త్రం' మొదలైన గ్రంథాలు రాసి తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నత మూర్తి అని కొనియాడారు. అలాగే ఆయన ఉత్తమ పరిపాలనాధ్యక్షుడని, ఈ రోజు ఈ విశ్వవిద్యాలయం ఇంత చక్కగా ఉండడానికి ఆ రోజు ఆయన వేసిన పునాదులే కారణమన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ వందేళ్ళకు ముందే ఎంతో దూరదృష్టితో ఈ విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఏర్పాటుకు ఆయన గొప్ప ప్రయత్నం చేశారన్నారు. ఈనాడు ఈ విశ్వవిద్యాలయం కోట్లమంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఆచార్య యోహన్‌బాబు మాట్లాడుతూ ఉత్తమ పరిపాలనాదక్షుడు, జ్ఞాన సంపన్నుడు అని, ఆంధ్రవిశ్వ కళాపరిషత్ ఈ రోజు ఇక్కడ నుంచి విద్యార్థులకు జ్ఞానపు వెలుగులు పంచుతుందంటే కట్టమంచే కారణమన్నారు. డాక్టర్ దామెర వెంకటసూర్యరావు మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర ఆవిర్భావ దశలో విద్యావేత్తగా, కవిగా, రాజనీతిజ్ఞుడుగా, విమర్శకుడిగా తనదైన విశిష్ట, విలక్షణమైన స్థానాన్ని సంపాదించారన్నారు. కార్యక్రమంలో ఆచార్య వెలమల సిమ్మన్న, తెలుగుశాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం.కృష్ణవేణి, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బి.సూర్యనారాయణ, డాక్టర్ ఎం.ప్రతాప్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్.గిరిష్‌కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, పితాని ప్రసాద్, పలువురు సాహితీవేత్తలు, నగర ప్రముఖులు, భాషాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

» జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శకుంతల



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శకుంతల

ఆరిలోవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :బాల వివాహాలను అరికట్టే బాధ్యత మనందరిపై ఉన్నదని జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ కె.శకుంతల పేర్కొన్నారు. శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకులం జూనియర్ కలశాలలో బుధవారం ఉదయం బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టే దిశగా భారత ప్రభుత్వం 100 రోజుల పాటు అవగాహన కార్యక్రమాల నిర్వహణ ప్రారంభించిదని తెలిపారు ఈ కార్యక్రమాలు 2026, మార్చి 8 వరకూ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాలు , బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివిహాలను అరికడదామంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది ఎస్.లీలావతి, వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ యూవీ జానకి, ప్రిన్సిపాల్ పి.మురళీ, అంగన్‌వాడీ కార్యకర్త జె.రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

20న నగరానికి బీజేపీ యాత్ర

» బీచ్ రోడ్డులో భారీ బహిరంగసభ



వివరాలు వెల్లడిస్తున్న పరశురామ్‌రాజు, పాల్గొన్న పార్టీ నేతలు సుహాసినీఆనంద్, దామోదర్ యాదవ్, కోటేశ్వరరావు తదితరులు

పెదవాల్తేరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అటల్-మోదీల సుపరిపాలన యాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు తెలిపారు. బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యాత్ర ఈ నెల 20న విశాఖ చేరుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరు కానున్నట్టు తెలిపారు. 'అటల్ ఆలోచన.. మోదీ ఆచరణ' పేరుతో మోదీ పాలన సాగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాద్, జిల్లా మీడియా ఇన్‌చార్జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన తప్పనిసరి

» కన్స్యూమర్స్ క్లబ్ కన్వీనర్ మర్రి సత్యనారాయణ



ర్యాలీ నిర్వహిస్తున్న కృష్ణా కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్స్ క్లబ్ కన్వీనర్ మర్రి సత్యనారాయణ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వస్తువులు లేదా ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పుడు లోపాలు, మోసాలు జరిగితే వినియోగదారులు కోర్టును ఆశ్రయించాలన్నారు. వ్యాపారాల్లో మోసాలు గురించి వినియోగదార్లకు ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. ఈ చట్టాల ద్వారా మోసం పోయిన వినియోగదార్లకు తక్షణ న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం న్యాయ సేవల అథారిటీ చట్టం-1987, వినియోగదార్ల రక్షణ చట్టం-2019పై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసరా ప్రతినిధి శత్రుఘ్నుడు, కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు వేదవ్యాస్, ఆర్వీ నాయుడు, మురళీకృష్ణ, బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల పత్రాలు జిల్లా కమిటీకి అప్పగింత

» ర్యాలీగా వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు అందజేసిన పార్టీ నేతలు



మద్దిలపాలెం : వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు సంతకాల ప్రతుల బాక్సులను అందిస్తున్న వైసీపీ నేతలు

మద్దిలపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నియోజకవర్గాల్లో సేకరించిన సంతకాలను సమన్వయకర్తలు బాక్సుల్లో పెట్టి మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కేకే రాజుకు అందించారు.ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి ఆయా నియోజకవర్గాల సమన్వకర్తల ఆధ్వర్యంలో సుమారు 4.70 లక్షల సంతకాలు చేసిన ప్రతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కోటి సంతకాల సేకరణలో భాగంగా తూర్పు నియోజకవర్గం పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు పర్యవేక్షణలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో సేకరించిన 83600 సంతకాల పత్రాలను పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో బుధవారం సమర్పించారు. ఎంఎంటీసీ కాలనీలోని పార్టీ తూర్పు నియోజకవర్గం కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, ఉమ్మిడి స్వాతిదాసు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా ఉపాధ్యక్షులు నడింపల్లి కృష్ణంరాజు, 16వ వార్డు అధ్యక్షులు చొల్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలి

» ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కార్మికులను ఇబ్బంది పెట్టే చర్యలను యాజమాన్యం మానుకోవాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం ఉద్యోగులు ఎంతో శ్రమిస్తున్నారని, కానీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు యాజమాన్యం గండికొట్టిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యం భిన్నంగా వ్యవహరిస్తోందని, దీంతో కార్మిక వర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

జిల్లా డీఎల్ఎస్ఏ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు



ర్యాలీలో పాల్గొన్న జడ్జిలు సన్యాసినాయుడు, తనూజారెడ్డి తదితరులు

బీచ్ రోడ్డు, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని జిల్లా డీఎల్ఎస్ఏ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. వినియోగదారుల ఫోరం జడ్జి తనూజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించేందుకు ఏటా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు చేసిన వస్తు సేవల విషయంలో మోసపోతే అందుబాటు లో ఉన్న పరిష్కార వేదికలను ఆశ్రయించాలన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, ఏయూ లా కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, అలక్‌చంద్రుడు, న్యాయవాదులు లక్ష్మీరామ్‌బాబు,నాగశ్రీవిద్యార్థులు పాల్గొన్నారు.

బోరియం సంస్థతో గీతం ఎంవోయూ

సాగర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాస్మొటిక్ ఉత్పత్తుల తయారీలో అంత ర్జాతీయంగా పేరొందిన బోరి యం బ్యూటీరిటైల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో గీతం వర్సి టీ బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్, బోరియం సంస్థ వ్యవస్థాపకుడు మూలగుండం శివరామకృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గుణశేఖరన్ మాట్లాడుతూ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

బోరియం సంస్థ భాగస్వామ్యంతో ఉపయుక్తమైన పరిశోధనలు చేపట్టాలని సూచించారు. బోరియం సంస్థ వ్యవస్థాపకుడు శివరామకృష్ణ మాట్లాడుతూ సౌందర్య సాధనాల్లో ఉపయోగించే మూల పదార్థాల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతున్నామని, ఈ పరిస్థితిని మార్చి కొత్త తరహా ఉత్పత్తులను దేశీయంగా తయారు చేయడం లక్ష్యంగా గీతం వర్సిటీతో సంయుక్త అధ్యయనాలు చేపడతామన్నారు.

సినిమా గైడ్

● ఆంధ్రా కింగ్ తాలూకా : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
● ప్రేమంటే : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
● 12ఎ రైల్వే కాలనీ : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
● రాజు వెడ్స్ రాంబాయి / మస్టీపోలీసు : జగదాంబ
● శిశు / రాజు వెడ్స్ రాంబాయి : శారదా
● పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ : రమాదేవి
● ది గర్ల ఫ్రండ్ : శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 37, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 24, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 42, దొండకాయలు 32, బంగాళ దుంపలు 17, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 46, బద్ద చిక్కుడు 50, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడ దుంపలు 30, కంద దుంప 50, దేముడు చిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 76, గోరు చిక్కుడు 48, కూర పెండలం 38, పనస పొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ఆసక్తికరంగా జాతీయ రోలర్ స్కేటింగ్ టోర్నీ

» ఆధిపత్యం ప్రదర్శించిన తమిళనాడు స్కేటర్లు



స్కేటింగ్ చేస్తున్న చిన్నారి

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వుడా పార్కులో రింక్‌లో జరుగుతున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. బుధవారం స్కేట్ బోర్డింగ్, రోలర్ ఫ్రీ స్టైల్ ఈవెంట్లలో జరిగిన పోటీల్లో తమిళనాడు స్కేటర్లు ఆధిపత్యం ప్రదర్శించి పతకాల పంట పండించారు. ఈ పోటీలకు వీఎంఆర్డీఏ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ భవానీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు.

ఫలితాలు : స్కేట్ బోర్డు... బాలుర 6-8 ఏళ్ల విభాగంలో ఎం.హష్విత్ (తెలంగాణ), సయ్యద్ అహ్మద్ (తమిళనాడు), ధ్రువ్ కార్తికేయన్ (తమిళనాడు)...బాలికల విభాగంలో ఎ.అయిమిన్ ఖాన్ (కేరళ), నివిష శ్రీ (తమిళనాడు), జె.మిగాల్ (తమిళనాడు); 8-10 ఏళ్ల బాలుర విభాగంలో శ్రీ కార్తీక్ (తమిళనాడు), శ్రీ అచ్యుత రాజు (తమిళనాడు), కమీర్ అభిమన్యు శర్మ (కర్ణాటక)....బాలికల విభాగంలో షేక్ సైదా (ఆంధ్ర), ఎ.శ్లోకరెడ్డి (తెలంగాణ), ఎం.శౌర్య అనఘ (ఆంధ్ర) స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. 10-12 ఏళ్ల బాలుర విభాగంలో యోషిరో సర్కార్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో అన్విత (కేరళ); 12-15 ఏళ్ల బాలుర విభాగంలో ఎస్‌డి.అశ్విన్ బాల (తమిళనాడు), బాలికల కేటగిరిలో రిమా హుస్సేన్ (కేరళ); 15-18 ఏళ్ల బాలుర విభాగంలో వి.హితేశ్వరన్ (తమిళనాడు), 18 ప్లస్ బాలుర కేటగిరిలో అరుణ్‌కుమార్ (ఉత్తర ప్రదేశ్) స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు.

రోలర్ ఫ్రీ స్టైల్ ఈవెంట్ : 12-15 ఏళ్ల బాలుర విభాగంలో మోక్షిత్, బాలికల విభాగంలో ఆర్.తర్షన (తమిళనాడు)....15-18 డి.ఆకాష్ (తమిళనాడు), బాలికల విభాగంలో ఓం గుజరాతి (మహారాష్ట్ర)...18 ప్లస్ బాలుర విభాగంలో ఆర్.అశ్విన్ (తమిళనాడు) స్వర్ణ పతకాలు సాధించారు.

ఆలిండియా జూనియర్ గోల్ఫ్ చాంపియన్ టైటిల్ విజేత ఆదిత్



కప్‌తో ఆదిత్ వీరమాచనేని

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ గోల్ఫ్ యూనియన్ (ఐజీయు) అఖిల భారత జూనియర్ బాలుర గోల్ఫ్ టోర్నీలో నగరానికి చెందిన ఆదిత్ వీరమాచనేని చాంపియన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. హర్యానాలోని ఐటీసీ క్లాసిక్ గోల్ఫ్ కోర్సులో జరిగిన ఈ టోర్నీలో ఐదవ ప్లే ఆఫ్‌లో అత్యధిక పాయింట్లు సాధించి చాంపియన్ ట్రోఫీని సొంతం చేసుకున్నాడు. చండీగఢ్‌కు చెందిన జోరావర్ సింగ్ సంధుతో హోరాహోరీగా జరిగిన రౌండ్లలో ఆదిత్ వీరమాచనేని 72-66-69 (9) అండర్ స్కోరుతో ఆధిపత్యాన్ని ప్రదర్శించి బాలుర-సీ కేటగిరి టైటిల్ విజేతగా నిలిచాడు. ఇండియన్ గోల్ఫ్ యూనియన్ (ఐజీయు) అండర్-12 కేటగిరిలో ప్రథమ ర్యాంక్‌లో ఉన్న ఆదిత్ వీరమాచినేని ఇప్పటివరకు థాయ్‌లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీలలో కూడా ప్రతిభను నిరూపించుకున్నాడు. అంతేకాకుండా దేశంలో జరిగిన ఎనిమిది జాతీయ గోల్ఫ్ టోర్నీలలో విజేతగా నిలిచి సత్తా చాటాడు. ప్రతిష్ఠాత్మక ఆలిండియా టైటిల్‌ను సాధించిన నేపథ్యంలో సింహాద్రి టీఎంటీ మేనేజింగ్ డైరెక్టర్ బండి సురేష్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు తదితరులు ఆదిత్‌ను అభినందించారు.

13న సీతమ్మధార లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్యశిబిరం

సీతమ్మధార, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో గల లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన జనరల్ ఫిజీషియన్లు, అంకాలజిస్టులు (క్యాన్సరల్ నిపుణులు), చర్మవ్యాధి నిపుణులు, ఈఎన్టీ వైద నిపుణులు, పోషకాహార నిపుణులు, యూరాలజిస్టులు, గైనకాలజిస్టులు, జనరల్ సర్జన్లు పాల్గొన్న వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ.48 లక్షలతో సెంట్రల్ లైటింగ్

» కంచరపాలెం మెట్టు నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఏర్పాటుకు చర్యలు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ శశికళ, టీడీపీ ఎస్సీ సెల్ నాయకురాలు ఈతలపాక సుజాత తదితరులు

కంచరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 55వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. కంచరపాలెం మెట్టు నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఆధునిక సెంటర్ లైటింగ్ పనుల నిమిత్తం రూ.48 లక్షల నిధులతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. గతంలో ఈ మార్గంలో లైటింగ్ సదుపాయం లేక రాత్రి సమయాల్లో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారని, ఇక్కడ వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. మెట్టు వద్ద ముత్యమాంబ ఆలయం నుంచి తాటిచెట్లపాలెం 28 బస్టాప్ వరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, బీజేపీ సీనియర్ నాయకులు కణితి విజయలక్ష్మి, వెదుళ్ల పార్వతితో పాటు ఆడారి శంకర్, ఈతలపాక సుజాత, లక్ష్మి, నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

కంచరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, అంతర్జాతీయ మత స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన మానవహక్కుల విలువలను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు 'మానవ హక్కుల ప్రాధాన్యం, సమానత్వం, న్యాయబద్ధ సమాజనిర్మాణంలో యూడీహెచ్‌ఆర్ పాత్ర' గురించి వివరించారు. ప్రొఫెసర్ నరవ ప్రకాశరావు మాట్లాడుతు మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల మహిళల బాస్కెట్‌బాల్ విజేత ఏవీఎన్ కళాశాల



విజేతగా నిలిచిన ఏవీఎన్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి విజయమోహన్

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏయూ అంతర్ కళాశాలల మహిళల బాస్కెట్‌బాల్ టోర్నీలో మిసెస్ ఏవీఎన్ కళాశాల చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. ద్వితీయ స్థానంలో అనిట్స్ కళాశాల, తృతీయ స్థానంలో బుల్లయ్య కళాశాల నిలిచాయి. ఏయూ బాస్కెట్‌బాల్ కోర్టులో బుధవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ దిలీప్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ 'పెసా' క్రీడలకు రాష్ట్ర మన్యం జట్ల ఎంపిక పోటీలు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పెసా) దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ నగరంలో నిర్వహించనున్న జాతీయ పెసా క్రీడా పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు నిర్వహించినట్టు డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ తెలిపారు. కొమ్మాదిలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, కబడ్డీ క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ఏలూరు గిరిజన ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఆర్చరీలో రికర్వ్ రౌండ్, అథ్లెటిక్స్‌లో మారథాన్ ఈవెంట్లలో క్రీడాకారులను ఎంపిక చేయగా, కబడ్డీ క్రీడాంశానికి ప్రతిభ గల క్రీడాకారులతో జట్టును సమకూర్చామన్నారు.

పరిశ్రమల కోసం 5,000 ఎకరాల సమీకరణ

... 7వ పేజీ తరువాయి

ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాల్లో మాత్రమే ప్రభుత్వ భూములతోపాటు కొంతమేర డీపట్టా భూములు, కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. గాజువాక, పెదగంట్యాడ, విశాఖ రూరల్, గోపాలపట్నం మండలాల్లో ప్రభుత్వ భూములు దాదాపు లేవు. మిగిలిన మండలాలు నగరంలో ఉన్నాయి. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కాలనీల కోసం నాలుగు వేల ఎకరాలు వరకూ సమీకరించింది. ఎంఐజీ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ఐదారు వందల ఎకరాలు కేటాయించింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం డీపట్టా భూములు సేకరించింది.

ఆర్టీసీలో జోష్

... 7వ పేజీ తరువాయి

ప్రయాణిస్తే అందులో పురుషులు 52 శాతం ఉంటే మహిళలు 48 శాతం ఉండేవారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు రోజువారీ మొత్తం ప్రయాణికుల సంఖ్య 4.18 లక్షలు ఉంది. అందులో స్త్రీశక్తి మహిళా ప్రయాణికుల సంఖ్య 3.1 లక్షలుగా నమోదయ్యింది. మొత్తం ప్రయాణికుల్లో ఇది 74 శాతం. జీరో టికెట్ ఇష్యూ ప్రకారం అధికారులు ఈ లెక్కలు తేల్చారు. స్త్రీశక్తి పథకానికి సంబంధించిన ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసులో కొన్నిమార్లు 120 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతున్నదని అధికారులు తెలిపారు. విశాఖ నుంచి శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పాతపట్నం, విజయనగరం, సాలూరు, బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు రాకపోకలు సాగించే స్త్రీశక్తి బస్సులు రోజంతా వంద శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తున్నాయని రీజియన్ స్థాయి అధికారులు తెలిపారు.

అంచనాకు మించి పెరిగిన ఆదాయం

స్త్రీశక్తి పథకం అమలు తరువాత అధికారుల అంచనాకు మించి ఆదాయం పెరిగింది. పథకం అమలుకు ముందు సగటున రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు వచ్చేది. పథకం అమలు తరువాత సగటున రూ.1.35 కోట్లుగా నమోదవుతున్నది. రూ.1.25 కోట్లు ఆదాయం నమోదుకాగలదని అధికారులు అంచనా వేశారు. అయితే వారి అంచనాకు మించి అధికంగా ఆదాయం నమోదవుతున్నట్టు అధికారులు వెల్లడించారు.

రోజువారీ కలెక్షన్ రూ.40 లక్షలు

ఆర్టీసీకి రోజువారీ ఆదాయం రూ.1.35 కోట్లుగా నమోదవుతున్నా, నగదు రూపంలో వచ్చేది రూ.40 లక్షలు. మిగిలిన రూ.95 లక్షలు స్త్రీశక్తి పథకం ద్వారా ప్రయాణించిన మహిళలకు సంబంధించినది. ఈ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. ఆగస్టు 15 నుంచి అక్టోబరు నెలాఖరు వరకూ ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు చెల్లించాల్సిన మొత్తంలో రూ.40 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

విమానాశ్రయంలో కంట్రోల్ రూమ్

... 7వ పేజీ తరువాయి

ఉన్నాయన్నారు. ఆ విమానాలకు సంబంధించి లగేజీని ప్రయాణికులకు అప్పగించే చర్యలు ఆ సంస్థ చేపట్టిందని, కొంతమందికి నేరుగా ఇళ్లకు పంపించే ఏర్పాటుచేసిందని తెలిపారు. విశాఖ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ సుమారు 8 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ సంఖ్య 30 శాతం మేర తగ్గిందన్నారు.

ఉక్కు సీఎండీ ఎంపికపై సందిగ్ధం

... 7వ పేజీ తరువాయి

ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వాస్తవానికి మూడు నెలల ముందే కమిటీ ఈ ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. సీఎండీ లేకుండా ఇంత పెద్ద సంస్థను ఇన్‌చార్జులతో ఎంతకాలం నడుపుతారో అర్థం కాని పరిస్థితి. నలుగురు డైరెక్టర్లలో ఇద్దరు లేరు. ఇప్పుడు సెయిల్‌లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్‌ను ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆయన ఐదేళ్లు ఈ పదవిలో ఉంటారు. పర్సనల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. ఎన్‌టీపీసీ అధికారిని ఎంపిక చేసి నెల రోజులు దాటినా ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదు. చీఫ్ విజిలెన్స్ అధికారిగా సెయిల్‌లో పనిచేస్తున్న సీవీఓ సత్యనారాయణ గుప్తాకు అదనపు బాధ్యతలు ఇస్తూ బుధవారం ఆదేశాలు ఇచ్చారు. ఏడాది కాలానికే ఉత్తర్వులు వచ్చాయి. ఇవి కాకుండా ప్లాంటులో కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి 15 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఉండేవారు. వారిలో పదోన్నతులు వచ్చి కొందరు, పదవీ విరమణ చేసి కొందరు వెళ్లిపోగా నాలుగేళ్ల నుంచి నియామకం చేపట్టలేదు. జనరల్ మేనేజర్ పోస్టులు కూడా దాదాపు సగం ఖాళీగా ఉన్నాయి. వాటినీ భర్తీ చేయలేదు. అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ పెంచి, 100 శాతం ఉత్పత్తి సాధించాలని ప్రయత్నిస్తున్న ఉక్కు మంత్రిత్వ శాఖ తాత్కాలిక అధికారులతో ఎందుకు ప్రయోగాలు చేస్తున్నదో రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించడం లేదు. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఇటీవల కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి పూర్తిస్థాయి బోర్డును నియమించాలని కోరిన పది రోజులకు ఈ రెండు పోస్టులను భర్తీ చేయడం కొంత ఊరట కలిగించింది. మిగిలిన పోస్టులు కూడా తక్షణమే భర్తీ చేస్తే కేంద్రం ఆశించిన ప్రగతి సాధ్యమవుతుంది.

అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

... 7వ పేజీ తరువాయి

దీపం ఉంచి ఇంట్లో పనులు చూసుకుంటున్నారు. గాలికి దీపం ఎగిరి కిందపడడంతో వాల్ కర్టెన్‌కు నిప్పంటుకుంది. దీంతో మంటలు ఆ గదితోపాటు పక్కనే ఉన్న గదికి వ్యాపించాయి. పొగ బయటకు రావడంతో అపార్టుమెంట్‌వాసులు గుర్తించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అగ్నిమాపక శకటాలతోపాటు ఎత్తైన భవనాల పైకి వెళ్లి మంటలను ఆర్పే సదుపాయం కలిగిన బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనంతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ఆర్ఎఫ్ఓ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తమకు సకాలంలో సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అపార్టుమెంట్‌లో ఉన్న అగ్నిమాపకపరికరాల సహాయంతో మంటలను అదుపు చేయగలిగామన్నారు. ఒంటరిగా ఉంటున్న మహిళ దీపం పెట్టడం, గాలికి ఎగిరిపడడం కారణంగానే ప్రమాదం సంభవించిందని భావిస్తున్నట్టు తెలిపారు.

అపార్టుమెంట్‌లో ఉన్న అగ్నిమాపక వ్యవస్థ బాగానే పనిచేస్తోందని కితాబిచ్చారు. ఈ సమాచారం తెలియగానే సీపీ శంఖబ్రతబాగ్చి అపార్టుమెంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్‌లో అగ్నిమాపక పరికరాలు ఉన్నప్పటికీ అవన్నీ కాలంచెల్లినవిగా గుర్తించామన్నారు. పైగా అగ్నిప్రమాదం జరిగితే వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై అపార్టుమెంట్ వాసులకు సరైన అవగాహన లేదన్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో నగరంలోని బహుళ అంతస్థుల భవనాలు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటిని వినియోగించడంపై ప్రజలకు అవగాహనపై ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించామన్నారు.

జీవీఎంసీ స్థలం కబ్జా

... 7వ పేజీ తరువాయి

స్థలానికి, పార్కుకు మధ్యలో ఉన్న జీవీఎంసీకి చెందిన సుమారు వెయ్యి గజాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ స్థలం విలువ ఇప్పుడు మార్కెట్‌లో దాదాపు రూ.ఐదు కోట్లు ఉంటుందని అంచనా. తర్వాత ఆ స్థలం అంతటినీ వేరొకరికి అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇటీవల జనసేనకు చెందిన ఒక కార్పొరేటర్ జీవీఎంసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకుని అద్దెకు ఇచ్చినట్టు పేర్కొంటూ ఆధారాలతో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి జీవీఎంసీకి చెందిన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయినా ఇంతవరకూ దీనిపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రూ.కోట్లు విలువైన జీవీఎంసీ స్థలాన్ని పరిరక్షించాలని ఆధారాలతో స్థానికులు పోరాడుతున్నాసరే అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూ రికార్డుల తారుమారుపై విచారణ

... 7వ పేజీ తరువాయి

పనిచేస్తున్నారు), కె.విజయభాస్కర్ (ప్రస్తుతం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు) రికార్డుల ట్యాంపరింగ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జేసీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు విచారణకు హాజరుకావాలని ఐదారు నెలల క్రితమే ఏడుగురినీ జేసీ ఆదేశించారు. అయితే యోగాంధ్ర, ఆ తరువాత వర్షాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. మంగళవారం జేసీ చేపట్టిన విచారణకు వీరంతా హాజరై వాంగ్మూలం అందజేశారు. మరిన్ని వివరాల కోసం మరోసారి విచారణ చేపట్టనున్నారు. ఇదిలావుండగా భీమిలి తహశీల్దారు కార్యాలయంలో 2020లో అవినీతి నిరోధక శాఖాధికారులు చేపట్టిన ఆకస్మిక దాడులకు సంబంధించి విచారణ బాధ్యతను జేసీకి ప్రభుత్వం అప్పగించింది. దీనికి అనుగుణంగా అప్పటి తహశీల్దారు, మరో 20 మంది సిబ్బంది విచారణకు హాజరయ్యారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



1970-80 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ మున్సిపల్ (ఎంజీఎం) ఉన్నత పాఠశాలలో 1978-80 మధ్య పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో బుధవారం కలుసుకున్నారు. 65 మంది ఒక గ్రూపుగా ఏర్పడి, తొలిసారి 2013లో సమావేశం నిర్వహించారు. నాటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశమై సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతుఉన్నారు. బుధవారం ఇరువాడ గ్రామంలోని దాసు వెంకట అప్పారావు ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు డీఎస్ఎన్ గుప్త, వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎస్ మూర్తి, అధ్యక్షుడు ఎన్. సత్యనారాయణ, కార్యదర్శి పి. కూర్మేష్, వి. మణిరామ్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కళాశాల స్థాయి నుంచే బాలికలు తమకున్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల అన్నారు. కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో నాంది ఫౌండేషన్, మహీంద్ర రైజ్ సంయుక్త ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థినులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ 2025 అన్న అంశంపై వారం రోజులుగా నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 213 మంది విద్యార్థినులు మూడు బ్యాచ్‌లలో ఈ కోర్సును అభ్యసించి సర్టిఫికెట్లు పొందారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, అధ్యాపకురాలు గీతాంజలి,శిక్షకులు సంతోశ్, భువన, రాజు, ప్రజ్ఞా పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ప్రతిఒక్కరికి మానవ హక్కులపై అవగాహన అవసరమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల అన్నారు. బుధవారం విశాఖ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల గురించి అవగాహన, ఉపయోగాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే హక్కులు పొందడంతో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జె. పూర్ణిమ, ఎం. రమ్య, బి. నాగమణి, జి. జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులో వలంటీర్‌గా పని చేసిన చాను భర్త ఖాదర్ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి దేవకినంద ఫౌండేషన్ చైర్మన్, 31వ వార్డు వైసీపీ అధ్యక్షుడు బాపు ఆనంద్ బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు.అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వల్లి, బాషా, మాబు, యాసీన్, గారి రాంబాబు, మోహన్, బాబూరావు, త్రినాథ్, మోహన్ పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం.. అత్యంత మనోహరం

» రాంభట్ల నృసింహశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోతన ఆధ్యాత్మికతను జోడించి రుక్మిణీ కల్యాణం రచించారని,., భక్తి, రౌద్రం, శృంగార మేళవింపు పోతన భాగవత రుక్మిణీ కల్యాణమని తిరుమల బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో పోతన భాగవత రుక్మిణీ కల్యాణంపై ప్రసంగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భాగవతుల సత్యనారాయణ మూర్తి భక్తిగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన రాంభట్ల నృసింహశర్మ మాట్లాడుతూ కథానాయిక రుక్మిణీ పాత్రను, ఆమె భక్తిని ఉదాహరణ పూర్వకంగా సభ ముందుంచారు. శిశుపాలుడు చెడుకు ప్రతిరూపమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన సాహితీ విశ్లేషకులు డీవీ సూర్యారావు మాట్లాడుతూ పురాణ సాహిత్యంలో వివాహ ఘట్టాల్లో రుక్మిణీ కల్యాణం అత్యంత మనోహరమని, పోతన మధుర రసంగా ఈ ఘట్టాన్ని తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సహృదయ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి సీహెచ్ చినసూర్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, డాక్టర్ కేవీఎస్ మూర్తి, కందాళ కనక మహాలక్ష్మి, సీహెచ్ నిర్మలాదేవి, చల్లా రంబాబు, సుప్రియ, బి.రాధారాణి, మోహన్‌రావు, విశ్వేశ్వరరావు, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

సన్‌లో 'కేక్' మిక్సింగ్



కేక్ మిశ్రమ తయారీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాజేశ్వరి, తదితరులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అన్ని పండగల సమ్మేళనమే భారతదేశం గొప్పతనమని సన్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, హెచ్ఓడీ నీలిమ లక్ష్మి, ప్లేస్‌మెంట్ అధికారి ప్రేమ్ పేర్కొన్నారు.బుధవారం సన్ సిటీ క్యాంపస్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకుని కేక్ మిక్సింగ్ గ్రేప్ స్టామింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పండుగ విశిష్ట నేటి యువతరానికి తెలియజేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. కేక్ తయారీ అనంతరం క్రిస్మస్ నాడు నగరంలోని అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తాం

వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):అనధికార లే అవుట్లలో స్థలాల కొనుగోలుదారులు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్. తేజ్‌భరత్ సూచించారు. వీఎంఆర్డీఏ పరిధిలోని ఎంపీడీవోలు, నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్లు, ఎల్‌టీపీలతో బుధవారం సమావేశమయ్యారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ ఫైనలైజేషన్ స్కీమ్(బీపీఎస్) పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు కచ్చితంగా దరఖాస్తు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఎల్‌టీపీలు తీసుకోవాలన్నారు. ఈనెల 20 వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి, అనధికార లేఅవుట్లు, అనుమతుల్లేని నిర్మాణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు 2026 జనవరి 23 వరకు గడువు పొడిగించారన్నారు. స్థల యజమానులకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా ఎన్జీవో నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా భవన్‌లో బుధవారం 23 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఏవీఎస్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. అధ్యక్షుడిగా వై. నారాయణరావు, కార్యదర్శిగా జి. చంద్రరావు, కోశాధికారిగా డి. రామారావు, నగేష్ పట్నాయక్, పి.ఆనంద్‌రెడ్డి, డి.శ్రీనుబాబు, జి.రామ్‌ప్రసాద్, పి. భవాని తదితరులు ఎన్నికయ్యారు.

వైసీపీ ర్యాలీ

అక్కయ్యపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పించే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలతో బుధవారం 46వ వార్డు నుంచి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని నరసింహనగర్ పోర్టు స్టేడియం వెనుక గేటు వరకూ వెళ్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కేకే రాజుకు అందజేశారు.

ఆకతాయిల అడ్డాగా పార్కు



గేటు, గ్రిల్స్ ఏర్పాటుకు నోచుకోని ప్రహరీ

మద్దిలపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ పార్కుకు రక్షణ కరువైంది. పార్కు ప్రహరీకి గేట్లు, పైన ఇనుప ఊచలు ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆకతాయిలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. పిఠాపురం కాలనీ పార్కుకు రక్షణగా గోడ నిర్మాణం చేపట్టి గేట్లు ఏర్పాటు చేశారు. బాగున్న ప్రహరీని విరగ్గొట్టి నూతన గోడ నిర్మాణానికి రూ.26 లక్షలతో పనులు చేపట్టారు. పది నెలల కిందటే ఉన్న ప్రహరీని తొలగించి కొత్త ప్రహరీ నిర్మాణం చేశారు. నాలుగు అడుగుల ఎత్తులో ప్రహరీ, రెండు అడుగుల ఇనుప ఊచలు, ముందుకు గేటు ఏర్పాటు చేయాలి. కాగా నాలుగు అడుగుల ప్రహరీని మాత్రం నిర్మించి ఇనుప ఊచలు, గేటు అమర్చలేదు. దీంతో చీకటి పడితే గంజాయి బాబులు పార్కు లోపల తిష్ఠ వేస్తున్నారు. మద్యం, గంజాయి సేవిస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రహరీకి ఊచలు, గేటు ఏర్పాటు చే సి రక్షణ కల్పించాలని స్థానికులుకోరుతున్నారు.

లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలు



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణ మంజూరు పత్రాలను ఆయా ప్రాంతాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం వాసవానిపాలెంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని 18, 19 వార్డుల పరిధిలోని వాసవానిపాలెం, పెదజాలారిపేట, జాలారి ఎండాడ, శివగణేష్ నగర్ ప్రాంతాల్లోని మత్స్యకారులు 85 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ పీఎంఏవై పథకంలో ఒక సెంటు భూమి కేటాయించిన పత్రాలు, ఇప్పటికే స్థలం ఉన్నవారికి గృహ నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాలను అందించారు. కేంద్రం వాటా రూ.1.5 లక్షలు, రాష్ట్ర వాటా రూ.లక్ష కలిపి రూ. 2.5 లక్షలు మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పోతనరెడ్డి, గొలగాని పోలారావు, ఓలిశెట్టి గురునాథం, బాపిరాజు, గణేష్, మత్స్యకార గ్రామాల పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీవేంకటేశ్వర వైభవం



విభీషణ శర్మ ప్రవచనం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ గోవింద నామస్మరణతో పులకించింది. ఆరో సెక్టరు భద్రం కమ్యూనిటీ హాలు ఆవరణలో బుధవారం నుంచి శ్రీ వేంకటేశ్వర వైభవం మొదలైంది. రుషిపీఠం విశాఖపట్నం సత్సంగ్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, తోమాల సేవ, తిరువీధి ఉత్సవం, సహస్ర దీపాలంకరణ, నాద నీరాజనం, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి శ్రీవారి భక్త బృందాలు పాల్గొన్నాయి. చిన్నారుల సంకీర్తనలు, అన్నమాచార్య కృతులు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. సాయంత్రం శ్రీవేంకటేశ్వర వైభవం పై ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ ప్రవచనం ఆకట్టుకుంది.

26న రంగానాడు బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలాజీ తదితరులు

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26న నగరంలోని ఆర్కే బీచ్ వద్ద రంగానాడు భారీ బహిరంగ నిర్వహిస్తున్నట్టు రాధా రంగ రాయల్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు గాదె బాలాజీ తెలిపారు. ఆశీల్‌మెట్టలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులతో కలసి ఆయన బహిరంగ ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ వంగవీటి మోహన్‌రంగా 37వ వర్ధంతి సందర్భంగా నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రంగా అభిమానులు విశాఖకు తరలిరానున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, వంగవీటి రంగా అభిమానులతో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బహిరంగ సభలో పది అంశాలను ప్రధాన అజెండాగా భవిష్యత్ కార్యక్రమాలకు సన్నద్ధమౌతున్నట్టు తెలిపారు. ఇందులో కృష్ణా జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలనే డిమాండ్ ఉందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా రంగా అంటే అభిమానించేవారు నేటికీ ఉన్నారన్నారు. 26 సాయంత్రం జరుగబోయే బహిరంగ సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సుధాకర్ నాయుడు, గుడివాడ ప్రభాకర్, శ్రీనివాసరావు, కేవీపీఎస్ భాస్కర్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలోని వ్యక్తే బైక్ చోరీ నిందితుడు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం చోరీ కేసులో ఎంవీపీ పోలీసులు నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. గతనెల 23న ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులోని డీఎల్ఎక్స్ హాస్టల్ వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వాహన యజమాని చంద్రశేఖర్ రాపిడో డెలివరీ బాయ్‌గా పని చేస్తుంటాడు. చంద్రశేఖర్ నిద్రపోతున్న సమయంలో వసతి గృహంలోనే ఉంటున్న మరో యువకుడు ఏరుబండి శ్రీరాజ్ అతడి జేబులో నుంచి బైకు తాళాలు దొంగలించాడు. అలాగే చంద్రశేఖర్ ఫోన్ తీసుకొని ఫోన్ ద్వారా వసతి గృహం అద్దె కూడా చెల్లించి బైకుతో పరారయ్యాడు. విచారణ జరిపిన ఎంవీపీ పోలీసులు నిందితుడిని బైకుతో సహా బుధవారం అరెస్టు చేశారు. నిందితుడు గుంటూరు టౌన్‌కు చెందిన వ్యక్తిగా ద్వారకా సీఐ చక్రధరరావు తెలిపారు.

విస్తృతంగా డ్రంకన్, డ్రైవ్ తనిఖీలు



హనుమంతవాక జంక్షన్‌లో డ్రంకన్, డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు.

ఆరిలోవ, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బుధవారం సాయంత్రం వాహన చోదకులపై డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు, కార్లపై వెళ్లే వాహనదారులకు ఈ పరీక్షలనువిస్తృతంగా చేపట్టారు.

తక్కువ ధరకు భూముల లీజు వ్యవహారంపై విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు భూములు లీజుకు ఇచ్చిన వ్యవహారంపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. మర్రిపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీవల్లి షిప్పింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థకు నామమాత్రపు ధరతో భూమిని లీజుకు కేటాయించారు. దీనిపై అప్పటి జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం (రిటైర్డ్ జేడీ) వీఆర్‌వీఆర్ నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ ఆర్.సత్యారావు (రిటైర్డ్)పై విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ అంశంపై విచారణకు గతంలో అడిషనల్ డైరెక్టర్ ఏవీ పటేల్‌ను నియమించగా, తాజాగా ఆ బాధ్యతలను అడిషనల్ డైరెక్టర్ ఎ.సుధాకర్‌కు అప్పగించి, గడువులోగా విచారణ నివేదిక అందజేయాలని సూచించింది.

ఏయూలో ఘనంగా 'కట్టమంచి' జయంతి



కట్టమంచి రామలింగారెడ్డికి నివాళులు అర్పిస్తున్న అచార్యులు, విద్యార్థులు

సీతంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖలో మాజీ వీసీ కట్టమంచి రామలింగారెడ్డి 145వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అడ్డాడ నరసింహారావు తదితరులు కట్ట రామలింగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జర్రా అప్పారావు మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి 'ముసలమ్మ మరణం', 'నవ యామిని', 'కవిత్వ తత్త్వవిచారం', 'పంచమి', 'వ్యాసమంజరి', 'అర్థశాస్త్రం' మొదలైన గ్రంథాలు రాసి తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నత మూర్తి అని కొనియాడారు. అలాగే ఆయన ఉత్తమ పరిపాలనాధ్యక్షుడని, ఈ రోజు ఈ విశ్వవిద్యాలయం ఇంత చక్కగా ఉండడానికి ఆ రోజు ఆయన వేసిన పునాదులే కారణమన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ వందేళ్లకు ముందే ఎంతో దూరదృష్టితో ఈ విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఏర్పాటుకు ఆయన గొప్ప ప్రయత్నం చేశారన్నారు. ఈనాడు ఈ విశ్వవిద్యాలయం కోట్లమంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఆచార్య యోహాన్‌బాబు మాట్లాడుతూ ఉత్తమ పరిపాలనాదక్షుడు, జ్ఞాన సంపన్నుడు అని, ఆంధ్రవిశ్వ కళాపరిషత్ ఈ రోజు ఇక్కడ నుంచి విద్యార్థులకు జ్ఞానపు వెలుగులు పంచుతుందంటే కట్టమంచే కారణమన్నారు. డాక్టర్ దామెర వెంకటసూర్యరావు మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర ఆవిర్భావ దశలో విద్యావేత్తగా, కవిగా, రాజనీతిజ్ఞుడుగా, విమర్శకుడిగా తనదైన విశిష్ఠ, విలక్షణమైన స్థానాన్ని సంపాదించారన్నారు. కార్యక్రమంలో ఆచార్య వెలమల సిమ్మన్న, తెలుగుశాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం.కృష్ణవేణి, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బి.సూర్యనారాయణ, డాక్టర్ ఎం.ప్రతాప్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్.గిరిష్‌కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, పితాని ప్రసాద్, పలువురు సాహితీవేత్తలు, నగర ప్రముఖులు, భాషాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

» జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ శకుంతల



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శకుంతల

ఆరిలోవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :బాల వివాహాలను అరికట్టే బాధ్యత మనందరిపై ఉన్నదని జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ కె.శకుంతల పేర్కొన్నారు. శ్రీకృష్ణాపురంలో గల అంబేడ్కర్ గురుకులం జూనియర్ కలశాలలో బుధవారం ఉదయం బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టే దిశగా భారత ప్రభుత్వం 100 రోజుల పాటు అవగాహన కార్యక్రమాల నిర్వహణ ప్రారంభించిదని తెలిపారు ఈ కార్యక్రమాలు 2026, మార్చి 8 వరకూ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాలు , బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివిహాలను అరికడదామంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది ఎస్.లీలావతి, వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ యూవీ జానకి, ప్రిన్సిపాల్ పి.మురళీ, అంగన్‌వాడీ కార్యకర్త జె.రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

20న నగరానికి బీజేపీ యాత్ర

» బీచ్ రోడ్డులో భారీ బహిరంగసభ



వివరాలు వెల్లడిస్తున్న పరశురామ్‌రాజు, పాల్గొన్న పార్టీ నేతలు సుహాసినీఆనంద్, దామోదర్ యాదవ్, కోటేశ్వరరావు తదితరులు

పెదవాల్తేరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అటల్-మోదీల సుపరిపాలన యాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎఎంఎన్ పరశురామ్ రాజు తెలిపారు. బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యాత్ర ఈ నెల 20న విశాఖ చేరుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో మాజీ ప్రధాని అటల్ బిహరి వాజ్‌పేయి విగ్రహావిష్కరణతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరు కానున్నట్టు తెలిపారు. 'అటల్ ఆలోచన.. మోదీ ఆచరణ' పేరుతో మోదీ పాలన సాగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాద్, జిల్లా మీడియా ఇన్‌చార్జి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన తప్పనిసరి

» కన్స్యూమర్స్ క్లబ్ కన్వీనర్ మర్రి సత్యనారాయణ



ర్యాలీ నిర్వహిస్తున్న కృష్ణా కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కన్స్యూమర్స్ క్లబ్ కన్వీనర్ మర్రి సత్యనారాయణ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వస్తువులు లేదా ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పుడు లోపాలు, మోసాలు జరిగితే వినియోగదారులు కోర్టును ఆశ్రయించాలన్నారు. వ్యాపారాల్లో మోసాలు గురించి వినియోగదార్లకు ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. ఈ చట్టాల ద్వారా మోసం పోయిన వినియోగదార్లకు తక్షణ న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం న్యాయ సేవల అథారిటీ చట్టం-1987, వినియోగదార్ల రక్షణ చట్టం-2019పై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆసరా ప్రతినిధి శత్రుఘ్నుడు, కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసిరావు, అధ్యాపకులు వేదవ్యాస్, ఆర్వీ నాయుడు, మురళీకృష్ణ, బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- ● ఆంధ్రా కింగ్ తాలూకా : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- ● ప్రేమంటే : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- ● 12ఎ రైల్వే కాలనీ : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి), మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ),
- ● రాజు వెడ్స్ రాంబాయి / మస్టీపోలీసు : జగదాంబ
- ● శిసు / రాజు వెడ్స్ రాంబాయి : శారదా
- ● పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ : రమాదేవి
- ● ది గర్ల్ ఫ్రండ్ : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 37, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవి వంకాయలు 24, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, బజ్జి పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 42, దొండకాయలు 32, బంగాళ దుంపలు 17, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 46, బద్ద చిక్కుడు 50, దోస కాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 22, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడ దుంపలు 30, కంద దుంప 50, దేముడు చిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 76, గోరు చిక్కుడు 48, కూర పెండలం 38, పనస పొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

వైసీపీ సంతకాల పత్రాలు జిల్లా కమిటీకి అప్పగింత

» ర్యాలీగా వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు అందజేసిన పార్టీ నేతలు



మద్దిలపాలెం : వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు సంతకాల ప్రతుల బాక్సులను అందిస్తున్న వైసీపీ నేతలు

మద్దిలపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నియోజకవర్గాల్లో సేకరించిన సంతకాలను సమన్వయకర్తలు బాక్సుల్లో పెట్టి మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కేకే రాజుకు అందించారు.ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ఏడు నియోజకవర్గాల నుంచి ఆయా నియోజకవర్గాల సమన్వకర్తల ఆధ్వర్యంలో సుమారు 4.70 లక్షల సంతకాలు చేసిన ప్రతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కోటి సంతకాల సేకరణలో భాగంగా తూర్పు నియోజకవర్గం పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు పర్యవేక్షణలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో సేకరించిన 83600 సంతకాల పత్రాలను పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో బుధవారం సమర్పించారు. ఎంవీపీ కాలనీలోని పార్టీ తూర్పు నియోజకవర్గం కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజుకు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కార్పొరేటర్లు మువ్వల లక్ష్మి, ఉమ్మిడి స్వాతిదాసు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా ఉపాధ్యక్షులు నడింపల్లి కృష్ణంరాజు, 16 వ వార్డు అధ్యక్షులు చొల్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలి

» ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కార్మికులను ఇబ్బంది పెట్టే చర్యలను యాజమాన్యం మానుకోవాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం ఉద్యోగులు ఎంతో శ్రమిస్తున్నారని, కానీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు యాజమాన్యం గండికొట్టిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యం భిన్నంగా వ్యవహరిస్తోందని, దీంతో కార్మిక వర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

జిల్లా డీఎల్ఎస్ఏ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు



ర్యాలీలో పాల్గొన్న జడ్జిలు సన్యాసినాయుడు, తనూజారెడ్డి తదితరులు

బీచ్ రోడ్డు, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండాలని జిల్లా డీఎల్ఎస్ఏ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. వినియోగదారుల ఫోరం జడ్జి తనూజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించేందుకు ఏటా ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు చేసిన వస్తు సేవల విషయంలో మోసపోతే అందుబాటు లో ఉన్న పరిష్కార వేదికలను ఆశ్రయించాలన్నారు. అనంతరం ఆర్కే బీచ్ కాళికామాత దేవాలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, ఏయూ లా కళాశాల ప్రిన్సిపాల్ సీతామాణిక్యం, అలక్‌చంద్రుడు, న్యాయవాదులు లక్ష్మీరామ్‌బాబు,నాగశ్రీ,విద్యార్థులు పాల్గొన్నారు.

బోరియం సంస్థతో గీతం ఎంవోయూ

సాగర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాస్మొటిక్ ఉత్పత్తుల తయారీలో అంత ర్జాతీయంగా పేరొందిన బోరి యం బ్యూటీరిటైల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో గీతం వర్సి టీ బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్, బోరియం సంస్థ వ్యవస్థాపకుడు మూలగుండం శివరామకృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గుణశేఖరన్ మాట్లాడుతూ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌లను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

బోరియం సంస్థ భాగస్వామ్యంతో ఉపయుక్తమైన పరిశోధనలు చేపట్టాలని సూచించారు. బోరియం సంస్థ వ్యవస్థాపకుడు శివరామకృష్ణ మాట్లాడుతూ సౌందర్య సాధనాల్లో ఉపయోగించే మూల పదార్థాల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతున్నామని, ఈ పరిస్థితిని మార్చి కొత్త తరహా ఉత్పత్తులను దేశీయంగా తయారు చేయడం లక్ష్యంగా గీతం వర్సిటీతో సంయుక్త అధ్యయనాలు చేపడతామన్నారు.

ఆసక్తికరంగా జాతీయ రోలర్ స్కేటింగ్ టోర్నీ

» ఆధిపత్యం ప్రదర్శించిన తమిళనాడు స్కేటర్లు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వుడా పార్కులో రింక్‌లో జరుగుతున్న 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. బుధవారం స్కేట్ బోర్డింగ్, రోలర్ ఫ్రీ స్టైల్ ఈవెంట్లలో జరిగిన పోటీల్లో తమిళనాడు స్కేటర్లు ఆధిపత్యం ప్రదర్శించి పతకాల పంట పండించారు. ఈ పోటీలకు వీఎంఆర్డీఏ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ భవానీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు.



స్కేటింగ్ చేస్తున్న చిన్నారి

ఫలితాలు : స్కేట్ బోర్డు... బాలుర 6-8 ఏళ్ల విభాగంలో ఎం.హష్విత్ (తెలంగాణ), సయ్యద్ అహ్మద్ (తమిళనాడు), ధ్రువ్ కార్తికేయన్ (తమిళనాడు)...బాలికల విభాగంలో ఎ.అయిమిన్ ఖాన్ (కేరళ), నివిష శ్రీ (తమిళనాడు), జె.మిగాల్ (తమిళనాడు); 8-10 ఏళ్ల బాలుర విభాగంలో శ్రీ కార్తీక్ (తమిళనాడు), శ్రీ అచ్యుత రాజు (తమిళనాడు), కమీర్ అభిమన్యు శర్మ (కర్ణాటక)....బాలికల విభాగంలో షేక్ సైదా (ఆంధ్ర), ఎ.శ్లోకరెడ్డి (తెలంగాణ), ఎం.శౌర్య అనఘ (ఆంధ్ర) స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. 10-12 ఏళ్ల బాలుర విభాగంలో యోషిరో సర్కార్ (మహారాష్ట్ర), బాలికల విభాగంలో అన్విత (కేరళ); 12-15 ఏళ్ల బాలుర విభాగంలో ఎస్‌డి.అశ్విన్ బాల (తమిళనాడు), బాలికల కేటగిరిలో రిమా హుస్సేన్ (కేరళ); 15-18 ఏళ్ల బాలుర విభాగంలో వి.హితేశ్వరన్ (తమిళనాడు), 18 ప్లస్ బాలుర కేటగిరిలో అరుణ్‌కుమార్ (ఉత్తర ప్రదేశ్) స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు.

రోలర్ ఫ్రీ స్టైల్ ఈవెంట్ : 12-15 ఏళ్ల బాలుర విభాగంలో మోక్షిత్, బాలికల విభాగంలో ఆర్.తర్షన (తమిళనాడు)....15-18 డి.ఆకాష్ (తమిళనాడు), బాలికల విభాగంలో ఓం గుజరాతి (మహారాష్ట్ర)...18 ప్లస్ బాలుర విభాగంలో ఆర్.అశ్విన్ (తమిళనాడు) స్వర్ణ పతకాలు సాధించారు.

ఆలిండియా జూనియర్ గోల్ఫ్ చాంపియన్ టైటిల్ విజేత ఆదిత్

విశాఖపట్నం, స్పోర్ట్స్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ గోల్ఫ్ యూనియన్ (ఐజీయు) అఖిల భారత జూనియర్ బాలుర గోల్ఫ్ టోర్నీలో నగరానికి చెందిన ఆదిత్ వీరమాచనేని చాంపియన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. హర్యానాలోని ఐటీసీ క్లాసిక్ గోల్ఫ్ కోర్సులో జరిగిన ఈ టోర్నీలో ఐదవ ప్లే ఆఫ్‌లో అత్యధిక పాయింట్లు సాధించి చాంపియన్ ట్రోఫీని సొంతం చేసుకున్నాడు. చండీగఢ్‌కు చెందిన జోరావర్ సింగ్ సంధుతో హోరాహోరీగా జరిగిన రౌండ్లలో ఆదిత్ వీరమాచనేని 72-66-69 (9) అండర్ స్కోరుతో ఆధిపత్యాన్ని ప్రదర్శించి బాలుర-సీ కేటగిరి టైటిల్ విజేతగా నిలిచాడు. ఇండియన్ గోల్ఫ్ యూనియన్ (ఐజీయు) అండర్-12 కేటగిరిలో ప్రథమ ర్యాంక్‌లో ఉన్న ఆదిత్ వీరమాచినేని ఇప్పటివరకు థాయ్‌లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీలలో కూడా ప్రతిభను నిరూపించుకున్నాడు. అంతేకాకుండా దేశంలో జరిగిన ఎనిమిది జాతీయ గోల్ఫ్ టోర్నీలలో విజేతగా నిలిచి సత్తా చాటాడు. ప్రతిష్ఠాత్మక ఆలిండియా టైటిల్‌ను సాధించిన నేపథ్యంలో సింహాద్రి టీఎంటీ మేనేజింగ్ డైరెక్టర్ బండి సురేష్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు తదితరులు ఆదిత్‌ను అభినందించారు.



కప్‌తో ఆదిత్ వీరమాచనేని

13న సీతమ్మధార లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్యశిబిరం

సీతమ్మధార, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధారలో గల లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నటు ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన జనరల్ ఫిజీషియన్లు, ఆంకాలజిస్టులు (క్యాన్సరల్ నిపుణులు), చర్మవ్యాధి నిపుణులు, ఈఎన్టీ వైద నిపుణులు, పోషకాహార నిపుణులు, యూరాలజిస్టులు, గైనకాలజిస్టులు, జనరల్ సర్జన్లు పాల్గొన్న వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ.48 లక్షలతో సెంట్రల్ లైటింగ్

» కంచరపాలెం మెట్టు నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఏర్పాటుకు చర్యలు

కంచరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 55వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. కంచరపాలెం మెట్టు నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు ఆధునిక సెంటర్ లైటింగ్ పనుల నిమిత్తం రూ.48 లక్షల నిధులతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. గతంలో ఈ మార్గంలో లైటింగ్ సదుపాయం లేక రాత్రి సమయాల్లో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారని, ఇక్కడ వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. మెట్టు వద్ద ముత్యమాంబ ఆలయం నుంచి తాటిచెట్లపాలెం 28 బస్టాప్ వరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శశికళ, బీజేపీ సీనియర్ నాయకులు కణితి విజయలక్ష్మి, వెదుళ్ల పార్వతితో పాటు ఆడారి శంకర్, ఈతలపాక సుజాత, లక్ష్మి, నూకరాజు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ శశికళ, టీడీపీ ఎస్సీ సెల్ నాయకురాలు ఈతలపాక సుజాత తదితరులు

ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

కంచరపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మనీ, అంతర్జాతీయ మత స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన మానవహక్కుల విలువలను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు 'మానవ హక్కుల ప్రాధాన్యం, సమానత్వం, న్యాయబద్ధ సమాజనిర్మాణంలో యూడీహెచ్ఆర్ పాత్ర' గురించి వివరించారు. ప్రొఫెసర్ నరవ ప్రకాశరావు మాట్లాడుతు మానవ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల మహిళల బాస్కెట్‌బాల్ విజేత ఏవీఎన్ కళాశాల



విజేతగా నిలిచిన ఏవీఎన్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి విజయమోహన్

విశాఖపట్నం, స్పోర్ట్స్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏయూ అంతర్ కళాశాలల మహిళల బాస్కెట్‌బాల్ టోర్నీలో మిసెస్ ఏవీఎన్ కళాశాల చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నది. ద్వితీయ స్థానంలో అనిట్స్ కళాశాల, తృతీయ స్థానంలో బుల్లయ్య కళాశాల నిలిచాయి. ఏయూ బాస్కెట్‌బాల్ కోర్టులో బుధవారం జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ దిలీప్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ 'పెసా' క్రీడలకు రాష్ట్ర మన్యం జట్ల ఎంపిక పోటీలు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయత్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పెసా) దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ నగరంలో నిర్వహించనున్న జాతీయ పెసా క్రీడా పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు నిర్వహించినట్టు డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ తెలిపారు. కొమ్మాదిలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అర్చరీ, అథ్లెటిక్స్, కబడ్డీ క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ఏలూరు గిరిజన ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. అర్చరీలో రికర్వ్ రౌండ్, అథ్లెటిక్స్‌లో మారథాన్ ఈవెంట్లలో క్రీడాకారులను ఎంపిక చేయగా, కబడ్డీ క్రీడాంశానికి ప్రతిభ గల క్రీడాకారులతో జట్టును సమకూర్చామన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



1970-80 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ మున్సిపల్ (ఎంజీఎం) ఉన్నత పాఠశాలలో 1978-80 మధ్య పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో బుధవారం కలుసుకున్నారు. 65 మంది ఒక గ్రూపుగా ఏర్పడి, తొలిసారి 2013లో సమావేశం నిర్వహించారు. నాటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశమై సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతుఉన్నారు. బుధవారం ఇరువాడ గ్రామంలోని దాసు వెంకట అప్పారావు ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు డీఎస్ఎన్ గుప్త, వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎన్ మూర్తి, అధ్యక్షుడు ఎన్. సత్యనారాయణ, కార్యదర్శి పి. కూర్మేష్, వి. మణిరామ్, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కళాశాల స్థాయి నుంచే బాలికలు తమకున్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల అన్నారు. కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో నాంది ఫౌండేషన్, మహీంద్ర రైజ్ సంయుక్త ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థినులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ 2025 అన్న అంశంపై వారం రోజులుగా నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 213 మంది విద్యార్థినులు మూడు బ్యాచ్‌లలో ఈ కోర్సును అభ్యసించి సర్టిఫికెట్లు పొందారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, అధ్యాపకురాలు గీతాంజలి,శిక్షకులు సంతోశ్, భువన, రాజు, ప్రజ్ఞా పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :ప్రతిఒక్కరికి మానవ హక్కులపై అవగాహన అవసరమని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. మంజుల అన్నారు. బుధవారం విశాఖ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కుల గురించి అవగాహన, ఉపయోగాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే హక్కులు పొందడంతో పాటు బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జె. పూర్ణిమ, ఎం. రమ్య, బి. నాగమణి, జి. జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులో వలంటీర్‌గా పని చేసిన చాను భర్త ఖాదర్ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి దేవకినంద ఫౌండేషన్ చైర్మన్, 31వ వార్డు వైసీపీ అధ్యక్షుడు బాపు ఆనంద్ బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు.అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వల్లి, బాషా, మాబు, యాసీన్, గౌరి రాంబాబు, మోహన్, బాబూరావు, త్రినాథ్, మోహన్ పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం.. అత్యంత మనోహరం

» రాంభట్ల నృసింహశర్మ

సీతంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోతన ఆధ్యాత్మికతను జోడించి రుక్మిణీ కల్యాణం రచించారని,., భక్తి, రౌద్రం, శృంగార మేళవింపు పోతన భాగవత రుక్మిణీ కల్యాణమని తిరుమల బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో పోతన భాగవత రుక్మిణీ కల్యాణంపై ప్రసంగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భాగవతుల సత్యనారాయణ మూర్తి భక్తిగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన రాంభట్ల నృసింహశర్మ మాట్లాడుతూ కథానాయిక రుక్మిణీ పాత్రను, ఆమె భక్తిని ఉదాహరణ పూర్వకంగా సభ ముందుంచారు. శిశుపాలుడు చెడుకు ప్రతిరూపమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన సాహితీ విశ్లేషకులు డీవీ సూర్యారావు మాట్లాడుతూ పురాణ సాహిత్యంలో వివాహ ఘట్టాల్లో రుక్మిణీ కల్యాణం అత్యంత మనోహరమని, పోతన మధుర రసంగా ఈ ఘట్టాన్ని తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో సహృదయ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి సీహెచ్ చినసూర్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, డాక్టర్ కేవీఎస్ మూర్తి, కందాళ కనక మహాలక్ష్మి, సీహెచ్ నిర్మలాదేవి, చల్లా రంబాబు, సుప్రియ, బి.రాధారాణి, మోహన్‌రావు, విశ్వేశ్వరరావు, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంభట్ల నృసింహశర్మ

సన్‌లో 'కేక్' మిక్సింగ్

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అన్ని పండగల సమ్మేళనమే భారతదేశం గొప్పతనమని సన్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, హెచ్ఓడీ నీలిమ లక్ష్మి, పేస్‌మెంట్ అధికారి ప్రేమ్ పేర్కొన్నారు.బుధవారం సన్ సిటీ క్యాంపస్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకుని కేక్ మిక్సింగ్ గ్రేప్ స్టామింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పండుగ విశిష్ట నేటి యువతరానికి తెలియజేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. కేక్ తయారీ అనంతరం క్రిస్మస్ నాడు నగరంలోని అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు.



కేక్ మిశ్రమ తయారీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాజేశ్వరి, తదితరులు

అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేస్తాం

వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తేజ్ భరత్

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):అనధికార లే అవుట్లలో స్థలాల కొనుగోలుదారులు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని వీఎంఆర్డీఏ కమిషనర్ ఎన్. తేజ్‌భరత్ సూచించారు. వీఎంఆర్డీఏ పరిధిలోని ఎంపీడీవోలు, నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్లు, ఎల్‌టీపీలతో బుధవారం సమావేశమయ్యారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పైనలేజేషన్ స్కీమ్(బీపీఎస్) పథకాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు కచ్చితంగా దరఖాస్తు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఎల్‌టీపీలు తీసుకోవాలన్నారు. ఈనెల 20 వరకు క్షేత్రస్థాయిలో పర్యటించి, అనధికార లేఅవుట్లు, అనుమతుల్లేని నిర్మాణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు 2026 జనవరి 23 వరకు గడువు పొడిగించారన్నారు. స్థల యజమానులకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా ఎన్జీవో నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీవో జిల్లా భవన్‌లో బుధవారం 23 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కో పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఏవీఎస్ సుబ్రహ్మణ్యం ప్రకటించారు. అధ్యక్షుడిగా వై. నారాయణరావు, కార్యదర్శిగా జి. చంద్రరావు, కోశాధికారిగా డి. రామారావు, నగేష్ పట్నాయక్, పి.ఆనంద్‌రెడ్డి, డి.శ్రీనుబాబు, జి.రామ్ ప్రసాద్, పి. భవాని తదితరులు ఎన్నికయ్యారు.

వైసీపీ ర్యాలీ

అక్కయ్యపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పించే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలతో బుధవారం 46వ వార్డు నుంచి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని నరసింహనగర్ పోర్టు స్టేడియం వెనుక గేటు వరకూ వెళ్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు కేకే రాజుకు అందజేశారు.

పరిశ్రమల కోసం 5,000 ఎకరాల సమీకరణ

... 7వ పేజీ తరువాయి

ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాల్లో మాత్రమే ప్రభుత్వ భూములతోపాటు కొంతమేర డీపట్టా భూములు, కొండవాలు ప్రాంతాలు ఉన్నాయి. గాజువాక, పెదగంట్యాడ, విశాఖ రూరల్, గోపాలపట్నం మండలాల్లో ప్రభుత్వ భూములు దాదాపు లేవు. మిగిలిన మండలాలు నగరంలో ఉన్నాయి. గత ప్రభుత్వం పేదల ఇళ్ల కాలనీల కోసం నాలుగు వేల ఎకరాలు వరకూ సమీకరించింది. ఎంఐజీ టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ఐదారు వందల ఎకరాలు కేటాయించింది. కూటమి ప్రభుత్వం తాజాగా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం డీపట్టా భూములు సేకరించింది.

ఆర్టీసీలో జోష్

... 7వ పేజీ తరువాయి

ప్రయాణిస్తే అందులో పురుషులు 52 శాతం ఉంటే మహిళలు 48 శాతం ఉండేవారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు రోజువారీ మొత్తం ప్రయాణికుల సంఖ్య 4.18 లక్షలు ఉంది. అందులో స్త్రీశక్తి మహిళా ప్రయాణికుల సంఖ్య 3.1 లక్షలుగా నమోదయ్యింది. మొత్తం ప్రయాణికుల్లో ఇది 74 శాతం. జీరో టికెట్ ఇష్యూ ప్రకారం అధికారులు ఈ లెక్కలు తేల్చారు. స్త్రీశక్తి పథకానికి సంబంధించిన ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ సర్వీసులో కొన్నిమార్లు 120 శాతం వరకు ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతున్నదని అధికారులు తెలిపారు. విశాఖ నుంచి శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పాతపట్నం, విజయనగరం, సాలూరు, బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు రాకపోకలు సాగించే స్త్రీశక్తి బస్సులు రోజంతా వంద శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తున్నాయని రీజియన్ స్థాయి అధికారులు తెలిపారు.

అంచనాకు మించి పెరిగిన ఆదాయం

స్త్రీశక్తి పథకం అమలు తరువాత అధికారుల అంచనాకు మించి ఆదాయం పెరిగింది. పథకం అమలుకు ముందు సగటున రోజువారీ ఆదాయం రూ.95 లక్షలు వచ్చేది. పథకం అమలు తరువాత సగటున రూ.1.35 కోట్లుగా నమోదవుతున్నది. రూ.1.25 కోట్లు ఆదాయం నమోదుకాగలదని అధికారులు అంచనా వేశారు. అయితే వారి అంచనాకు మించి అధికంగా ఆదాయం నమోదవుతున్నట్టు అధికారులు వెల్లడించారు.

రోజువారీ కలెక్షన్ రూ.40 లక్షలు

ఆర్టీసీకి రోజువారీ ఆదాయం రూ.1.35 కోట్లుగా నమోదవుతున్నా, నగదు రూపంలో వచ్చేది రూ.40 లక్షలు. మిగిలిన రూ.95 లక్షలు స్త్రీశక్తి పథకం ద్వారా ప్రయాణించిన మహిళలకు సంబంధించినది. ఈ మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. ఆగస్టు 15 నుంచి అక్టోబరు నెలాఖరు వరకూ ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు చెల్లించాల్సిన మొత్తంలో రూ.40 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

విమానాశ్రయంలో కంట్రోల్ రూమ్

... 7వ పేజీ తరువాయి

ఉన్నాయన్నారు. ఆ విమానాలకు సంబంధించి లగేజీని ప్రయాణికులకు అప్పగించే చర్యలు ఆ సంస్థ చేపట్టిందని, కొంతమందికి నేరుగా ఇళ్లకు పంపించే ఏర్పాటుచేసిందని తెలిపారు. విశాఖ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ సుమారు 8 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ సంఖ్య 30 శాతం మేర తగ్గిందన్నారు.

ఉక్కు సీఎండీ ఎంపికపై సందిగ్ధం

... 7వ పేజీ తరువాయి

ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వాస్తవానికి మూడు నెలల ముందే కమిటీ ఈ ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. సీఎండీ లేకుండా ఇంత పెద్ద సంస్థను ఇన్‌చార్జులతో ఎంతకాలం నడుపుతారో అర్థం కాని పరిస్థితి. నలుగురు డైరెక్టర్లలో ఇద్దరు లేరు. ఇప్పుడు సెయిల్‌లో పనిచేస్తున్న జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్‌ను ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆయన ఐదేళ్లు ఈ పదవిలో ఉంటారు. పర్సనల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. ఎన్‌టీపీసీ అధికారిని ఎంపిక చేసి నెల రోజులు దాటినా ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదు. చీఫ్ విజిలెన్స్ అధికారిగా సెయిల్‌లో పనిచేస్తున్న సీవీఓ సత్యనారాయణ గుప్తాకు అదనపు బాధ్యతలు ఇస్తూ బుధవారం ఆదేశాలు ఇచ్చారు. ఏడాది కాలానికే ఉత్తర్వులు వచ్చాయి. ఇవి కాకుండా ప్లాంటులో కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి 15 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఉండేవారు. వారిలో పదోన్నతులు వచ్చి కొందరు, పదవీ విరమణ చేసి కొందరు వెళ్లిపోగా నాలుగేళ్ల నుంచి నియామకం చేపట్టలేదు. జనరల్ మేనేజర్ పోస్టులు కూడా దాదాపు సగం ఖాళీగా ఉన్నాయి. వాటినీ భర్తీ చేయలేదు. అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ పెంచి, 100 శాతం ఉత్పత్తి సాధించాలని ప్రయత్నిస్తున్న ఉక్కు మంత్రిత్వ శాఖ తాత్కాలిక అధికారులతో ఎందుకు ప్రయోగాలు చేస్తున్నదో రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించడం లేదు. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ ఇటీవల కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి పూర్తిస్థాయి బోర్డును నియమించాలని కోరిన పది రోజులకు ఈ రెండు పోస్టులను భర్తీ చేయడం కొంత ఊరట కలిగించింది. మిగిలిన పోస్టులు కూడా తక్షణమే భర్తీ చేస్తే కేంద్రం ఆశించిన ప్రగతి సాధ్యమవుతుంది.

అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదం

... 7వ పేజీ తరువాయి

దీపం ఉంచి ఇంట్లో పనులు చూసుకుంటున్నారు. గాలికి దీపం ఎగిరి కిందపడడంతో వాల్ కర్టెన్‌కు నిప్పంటుకుంది. దీంతో మంటలు ఆ గదితోపాటు పక్కనే ఉన్న గదికి వ్యాపించాయి. పొగ బయటకు రావడంతో అపార్టుమెంట్‌వాసులు గుర్తించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అగ్నిమాపక శకటాలతోపాటు ఎత్తైన భవనాల పైకి వెళ్లి మంటలను ఆర్పే సదుపాయం కలిగిన బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనంతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ఆర్ఎఫ్ఓ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తమకు సకాలంలో సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అపార్టుమెంట్‌లో ఉన్న అగ్నిమాపకపరికరాల సహాయంతో మంటలను అదుపు చేయగలిగామన్నారు. ఒంటరిగా ఉంటున్న మహిళ దీపం పెట్టడం, గాలికి ఎగిరిపడడం కారణంగానే ప్రమాదం సంభవించిందని భావిస్తున్నట్టు తెలిపారు.

అపార్టుమెంట్‌లో ఉన్న అగ్నిమాపక వ్యవస్థ బాగానే పనిచేస్తోందని కితాబిచ్చారు. ఈ సమాచారం తెలియగానే సీపీ శంఖబ్రతబాగ్చి అపార్టుమెంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్‌లో అగ్నిమాపక పరికరాలు ఉన్నప్పటికీ అవన్నీ కాలంచెల్లినవిగా గుర్తించామన్నారు. పైగా అగ్నిప్రమాదం జరిగితే వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై అపార్టుమెంట్ వాసులకు సరైన అవగాహన లేదన్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో నగరంలోని బహుళ అంతస్థుల భవనాలు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటిని వినియోగించడంపై ప్రజలకు అవగాహనపై ఫైర్ సేఫ్టీ, ఎలక్ట్రిక్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించామన్నారు.

జీవీఎంసీ స్థలం కబ్జా

... 7వ పేజీ తరువాయి


స్థలానికి, పార్కుకు మధ్యలో ఉన్న జీవీఎంసీకి చెందిన సుమారు వెయ్యి గజాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ స్థలం విలువ ఇప్పుడు మార్కెట్‌లో దాదాపు రూ.ఐదు కోట్లు ఉంటుందని అంచనా. తర్వాత ఆ స్థలం అంతటినీ వేరొకరికి అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు కొందరు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇటీవల జనసేనకు చెందిన ఒక కార్పొరేటర్ జీవీఎంసీ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకుని అద్దెకు ఇచ్చినట్టు పేర్కొంటూ ఆధారాలతో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి జీవీఎంసీకి చెందిన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయినా ఇంతవరకూ దీనిపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రూ.కోట్లు విలువైన జీవీఎంసీ స్థలాన్ని పరిరక్షించాలని ఆధారాలతో స్థానికులు పోరాడుతున్నాసరే అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూ రికార్డుల తారుమారుపై విచారణ

... 7వ పేజీ తరువాయి

పనిచేస్తున్నారు), కె.విజయభాస్కర్ (ప్రస్తుతం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు) రికార్డుల ట్యాంపరింగ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని జేసీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు విచారణకు హాజరుకావాలని ఐదారు నెలల క్రితమే ఏడుగురినీ జేసీ ఆదేశించారు. అయితే యోగాంధ్ర, ఆ తరువాత వర్షాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. మంగళవారం జేసీ చేపట్టిన విచారణకు వీరంతా హాజరై వాంగ్మూలం అందజేశారు. మరిన్ని వివరాల కోసం మరోసారి విచారణ చేపట్టనున్నారు. ఇదిలావుండగా భీమిలి తహశీల్దారు కార్యాలయంలో 2020లో అవినీతి నిరోధక శాఖాధికారులు చేపట్టిన ఆకస్మిక దాడులకు సంబంధించి విచారణ బాధ్యతను జేసీకి ప్రభుత్వం అప్పగించింది. దీనికి అనుగుణంగా అప్పటి తహశీల్దారు, మరో 20 మంది సిబ్బంది విచారణకు హాజరయ్యారు.

12న కాలభైరవుడి జయంతి



కాలభైరవుడు

పెందుర్తిరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్గశిర బహుల అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద గాడి గ్రామంలో ఉన్న కాలభైరవ స్వామి దేవాలయంలో శుక్రవారం కాలభైరవ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించి పీఠం నిర్వాహకులు విశ్వసాయి గురుజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించి గోత్ర నామాలతో తమ వివరాలు నమోదు చేసుకోవాని తెలిపారు.

త్రిశక్తి ఆలయంలో పూజలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం సందర్భంగా ఉక్కు త్రిశక్తి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న దుర్గాదేవి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో రోజూ విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకుడు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'లీ' ఫార్మా కంపెనీ, శ్రీసాయి శార్వాణి పాఠశాల సంయుక్తంగా అక్కిరెడ్డిపాలెంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అధిక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ శిబిరంలో సుమారు 180 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

ఎన్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో కొలువైన వైంకుఠ వెంకటేశ్వరాలయంలో నాలుగు రోజులుగా పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోకి నూతనంగా తీసుకువచ్చిన ఉత్సవ విగ్రహాలకు హోమాలు, సంప్రోక్షణ, జపాలు చేసి ప్రాణప్రతిష్ఠ చేశారు. దీనిలో భాగంగా ఆయా ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా టెట్

పెందుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో టెట్ ప్రారంభమయింది. డిసెంబరు 10 నుంచి 21 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇలా రెండు విడతలుగా పరీక్ష నిర్వహించారు. బుధవారం జరిగిన టెట్‌కు సుమారు 1450 మంది అభ్యర్థులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద సహాయక కేంద్రం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 37, వంకాయలు(తెలుపు) 38, వంకాయలు (నలుపు) 44, గుత్తి/రవివంకాయలు 24, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, బజ్జీ పకోడి మిర్చి 58, కాకరకాయలు 48, బీరకాయలు 46, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్42, దొండకాయలు32, బంగాళదుంపలు 17, కాప్సికమ్ 64, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 64, బరబాటి 42, పోటల్స్ 54, ముల్లంగి 30, నిమ్మకాయలు(కిలో) 46, బద్దచిక్కుడు 50, దోసకాయలు 22, పోటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 40, బీన్స్ (పెన్సిల్) 60, కీరదోస 22, కాప్సికమ్60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 30, కందదుంప 50, దేముడుచిక్కుడు 54, గ్రీన్‌పీస్ బటాని 76, గోరుచిక్కుడు 48, కూర పెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 66, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 80, బూడిదగుమ్మడికాయ20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ఆక్రమణలతో కుంచించుకుపోయిన గెడ్డలు

- మొన్నటి వరకు 25 - 30 అడుగులు వెడల్పు ఉండే గెడ్డలు నేడు 5 నుంచి 10 అడుగులే
- చిన్న వర్షానికే నీట మునుగుతున్న లోతట్టు ప్రాంతాలు



జీవీఎంసీ 70, 87 వార్డుల్లో మురుగునీటి గెడ్డను ఆనుకుని చేపట్టిన నిర్మాణాలు

కూర్మన్నపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణల పుణ్యమా అని గెడ్డలు కాస్త పిల్ల కాలువల్లా తయారైయాయి. దీంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. మొన్నటి వరకు 25-30 అడుగులు వెడల్పు ఉండే గెడ్డలు ఇప్పుడు చూస్తే కేవలం 5-10 అడుగులు మాత్రమే కనిపిస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకే వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఎంత పెద్ద వర్షం కురిసినా వరద నీరు గెడ్డల ద్వారా సజావుగా ప్రవహించేది. ఎక్కడా నీరు నిలిచేది కాదు. కాని ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించి గెడ్డల ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. 70 వార్డులో ఎర్రగెడ్డ కాలనీ, కుంచుమాంబ కాలనీలకు ఆనుకుని ఉన్న గెడ్డలు, వడ్లపూడిలో ఉన్న చాకలిగెడ్డ, కృష్ణుడి గుడి వద్ద ఉన్న ప్రధాన గెడ్డలు ఆక్రమణకోరల్లో చిక్కుకున్నాయి. ఇన్నాళ్లు జీవీఎంసీ, మండల రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. మురుగు గెడ్డలను ఆనుకుని సుమారు 46 కాలనీలు ఉన్నాయి. గట్టిగా వాన వస్తే గెడ్డ పరిసర ప్రాంత కాలనీలు ముంపులో చిక్కుకుంటున్నాయి. గెడ్డలపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. నివాసితులు గెడ్డలను ఆక్రమణ చేస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ గెడ్డల ఆక్రమణలను తొలగించడంలో యంత్రాంగం జాగు చేస్తోంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వే చేయాలి..

ఆక్రమణలకు గురైన మురుగు గెడ్డలను సర్వే చేయాలి. మండల రెవెన్యూ, జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు మాస్టర్ ప్లాన్ ప్రకారం గెడ్డలను ఒకే వెడల్పుతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు పూడికలను తొలగించి, మురుగు, వర్షం నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ముంపు సమస్య లేకుండా గెడ్డలకు ఇరువైపులా గోడల ఎత్తు పెంచి, మరమ్మతులు చేయిస్తే మంచిదని కాలనీవాసుల అభిప్రాయం.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అగనంపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును స్థానిక నాయకులు బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ప్రధాన సమస్యలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా రైతు బజార్ లేకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అగనంపూడి కేంద్రంగా ప్రత్యేక రెవెన్యూ మండలం ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. జోన్ కార్యాలయాం ఏర్పాటుకు సొంత భవనం నిర్మాణానికి చొరవ తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు



వాహనదారులకు సూచలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు

పెందుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు అన్నారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయాన్ని కొంతవరకు నివారణ చేయగలమని స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా నడిపితే ఫైన్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు డీటీవోకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

పెందుర్తి డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల అరికట్టడం సామాజిక బాధ్యత అని సమగ్ర బాలల పరిరక్షణ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భగా బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహ ముక్తి భారత్ వంద రోజుల ప్రణాళికను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

చురుగ్గా రక్షణ గోడ నిర్మాణం



నిర్మాణపనులు జరగుతున్న దృశ్యం

వేపగుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డులో జువ్వాలమ్మ గుడి నుంచి సాయి మాధవనగర్ వెళ్లే మార్గంలో రక్షణగోడ సక్రమంగా లేకపోవడంతో రహదారి కుంగిపోయింది. దీనిని అరికట్టడానికి జీవీఎంసీ సుమారు రూ.80 లక్షల నిధులతో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. ఇప్పుడు ఆ నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయి.

'మౌలిక వసతుల కల్పనకు కృషి'

ఎన్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీ దరి సీతారామరాజునగర్ పార్కులో రూ.18 లక్షల కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేయనున్న జిమ్, పార్కు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి వేగవంతం చేయడంలో ఎమ్మెల్యే గణబాబు సహకారం ఉందన్నారు. వార్డులోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కొండవాలు ప్రాంతాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంగివలసలో త్రుటిలో తప్పిన ప్రమాదం

తగరపువలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస వద్ద అపార్టుమెంటులోని ప్లాట్‌లో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు అప్రమత్తం కారణంతో పెను ప్రమాదం తప్పింది. సంగివలసలోని మార్వెల్ అపార్టుమెంటులో 90 ప్లాట్లు ఉన్నాయి. 316వ ప్లాట్‌లో మహిళ వాషింగ్ మిషన్ వేయగా విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా రెండేళ్ల క్రితం నిర్మించిన ఈ అపార్టుమెంటులో బిల్డరు అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించకుండా ప్లాట్లు అప్పగించారని యజమానులు ఆరోపిస్తున్నారు. అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సమర్థత ఉన్న నాయకుడికి ప్రజలు బ్రహ్మరథం పడతారని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి అన్నారు. 87 వార్డు వడ్లపూడిలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ బొండా జగన్‌తో కలసి రూ.7 కోట్లతో అభివృద్ధి పనులకు బుధవారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వైసీపీ హయాంలో అభివృద్ధి కుంటుపడి ందని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతు న్నానని అన్నారు. నియోజకవర్గంలో రూ.226 కోట్లతో అభివృద్ధి పనులు జరగనున్నాయని, దీనిలో భాగంగా ఒక్క 87వ వార్డులోనే రూ.26 కోట్లు అభివృద్ధి పనులకు మంజూరు అయ్యాయని తెలి పారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు గతంలో తాను ఆమరణ నిరాహార దీక్ష చేశానని, ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సుమారు రూ.15 వేల కోట్లు తెచ్చానని, కర్మాగారం పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళికలను, వాటికి అవసరమైన నిధులు మంజూరు తదితర విషయాలను కార్పొరేటర్ బొండా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు, తదితర నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు భూముల లీజు వ్యవహారంపై విచారణ

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు భూములు లీజుకు ఇచ్చిన వ్యవహారంపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. మర్రిపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీవల్లి షిప్పింగ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థకు నామమాత్రపు ధరతో భూమిని లీజుకు కేటాయించారు. దీనిపై అప్పటి జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం (రిటైర్డ్ జేడీ) వీఆర్‌వీఆర్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ ఆర్.సత్యారావు (రిటైర్డ్)పై విచారణ చేపట్టి, నివేదిక సమర్పించాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఈ అంశంపై విచారణకు గతంలో అడిషనల్ డైరెక్టర్ ఏవీ పటేల్‌ను నియమించగా, తాజాగా ఆ బాధ్యతలను అడిషనల్ డైరెక్టర్ ఎ.సుధాకర్‌కు అప్పగించి, గడువులోగా విచారణ నివేదిక అందజేయాలని సూచించింది.

20న నగరానికి బీజేపీ యాత్ర

బీచ్ రోడ్డులో భారీ బహిరంగసభ : పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు



వివరాలు వెల్లడిస్తున్న పరశురామ్‌రాజు, పాల్గొన్న పార్టీ నేతలు సుహాసినీఆనంద్, దామోదర్ యాదవ్, కోటేశ్వరరావు తదితరులు

పెదవాల్తేరు డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అటల్-మోదీల సుపరిపాలన యాత్రను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎఎంఎన్ పరశురామ్ రాజు తెలిపారు. బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యాత్ర ఈ నెల 20న విశాఖ చేరుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరు కానున్నట్టు తెలిపారు. 'అటల్ ఆలోచన.. మోదీ ఆచరణ' పేరుతో మోదీ పాలన సాగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ యాద్, జిల్లా మీడియా ఇన్‌చార్జి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



తుప్పు పట్టిన స్తంభానికి ఆసరాగా పెట్టిన మరో రెండు స్తంభాలు, (ఇన్‌సెట్‌లో) శిథిల స్థితిలో ఉన్న స్తంభం

ఆటోనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుంచుమాంబ కాలనీ నుంచి ఆటోనగర్ డీ బ్లాక్‌కు వెళ్లే రహదారిలో ఓ విద్యుత్ స్తంభం తుప్పుపట్టి ఒక పక్కకు ఒరిగిపోయింది. ఆ విద్యుత్ స్తంభాన్ని మార్చాల్సిన విద్యుత్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆ స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని పలువురు వినతులు, ఫిర్యాదులు చేశారు. దీంతో ఆ స్తంభాన్ని తొలగించకపోగా దానికి ఆసరాగా మరో మూడు స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ స్తంభం పిడిపోయేలా ఉండడంతో పలువురు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆ స్తంభానికి ఆసరాగా వేసిన అదనపు స్తంభాల వల్ల రాకపోకలకు ఇబ్బందులుగా వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే ఆ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పోర్టు రోడ్డులో దుమ్ముతో ఇబ్బంది



లారీ వెళ్లడంతో దుమ్ము రేగుతున్న దృశ్యం

గాజువాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోర్టు రోడ్డు పరిసర కాలనీల ప్రజలు దుమ్ము-ధూళి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గంగవరం పోర్టు నుంచి గాజువాక జోనల్ కార్యాలయం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల ప్రధాన రహదారి మొత్తం దుమ్ము ధూళితో నిండిపోయింది. దీనికి తోడు ఈమార్గంలో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువ ఉంటుంది. దీంతో దుమ్ము రేగి పరసర ఇళ్లు, పరసరాలు దుమ్ముతో నిండిపోతున్నాయి. స్వతంత్రనగర్, కర్ణవానిపాలెం, శ్రీనగర్ అఫిషియల్ కాలనీ స్థానిక ప్రాంతాల ప్రజలు ఈ సమస్య పరిష్కరించాలంటూ పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. పలుమార్లు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయినా సమస్యకు పరిష్కారం లభించలేదు. దీని వల్ల చిన్నపిల్లలు, వృద్ధులకు శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు ఈ సమస్య పెరుగుతుందే తప్పా తగ్గడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు చిత్రంలో తదితర నాయకులు

అన్ని దానాల్లో విద్యాదానం గొప్పది

- ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అన్నిదానాల్లో విద్యాదానం గొప్పదని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. 87వ వార్డు కణితి హైస్కూల్లో అమ్మాఫౌండేషన్ ఆర్థిక సహాయంతో నిర్మించిన నూతన తరగతి గదులను, గ్రంథాలయాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ దేశ పునఃనిర్మాణంలో భావి తరాల విద్యను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం, క్రమశిక్షణతో చదువు కొనసాగిస్తే సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని అన్నారు. అమ్మ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కోగంటి లెనిన్ బాబు మాట్లాడుతూ విద్యాసేవలో భాగస్వాములై తరగతి గదుల నిర్మాణపనులకు సహకరించడం అభినందనీయమన్నారు. సమాజంలో వెలుగులను నింపేది విద్య అని అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు తరగతి గదులు, గ్రంథాలయం నిర్మాణంలో పాలుపంచుకోవడం హర్షనీయమని బొండా జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు

గాజువాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గాజువాక శాఖా గ్రంథాలయం అభివృద్ధికి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యాజమాన్యం రూ.15 లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా అభివృద్ధి పనులకు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు బుధవారం జ్యోతి ప్రజ్వల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం అభివృద్ధికి కోరమాండల్ సంస్థ ముందుకు రావడం హర్షనీయం అన్నారు. సంస్థ డిప్యూటీ మేనేజర్ ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ కోరమాండల్ సంస్థ కల్పించిన వసతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, ఇతర శాఖాల గ్రంథాలయధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

గాజువాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తి అత్యంత ప్రమాదకరమని, దీనికి విద్యార్థులు దూరంగా ఉండాలని గాజువాక సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా గాజువాక వీడీఏ కళాశాలలో మానవహక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు తగిన విధంగా చదవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.యశోధ వేధమణి, కళాశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం పనుల పరిశీలన

అగనంపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి పెదమడక జీవీఎంసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేయనున్న జోన్- కార్యాలయం పనులను కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి కూటమి నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. విభాగాల వారీగా చేస్తున్న ఏర్పాట్లను డీఈ ఎన్.నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

'విద్యుత్ బిల్లులు కార్యాలయంలో కట్టించుకోరూ'

అగనంపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను కార్యాలయంలో కట్టించుకోవాలని ఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణను స్థానికులు బుధవారం కలిసి వనిత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఏఈకి వివరించారు. ఆన్‌లైన్‌లో తమకు విద్యుత్ బిల్లులు చెల్లించడం రాదని చెప్పారు. పాతపద్ధతిలోనే కార్యాలయంలో బిల్లులు చెల్లించడానికి అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఏఈ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలి

- ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కార్మికులను ఇబ్బంది పెట్టే చర్యలను యాజమాన్యం మానుకోవాలని ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం ఉద్యోగులు ఎంతో శ్రమిస్తున్నారని, కానీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు యాజమాన్యం గండికొట్టిందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యం భిన్నంగా వ్యవహరిస్తోందని, దీంతో కార్మిక వర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాంపురంలో 'ధర్తీ మాత బచావో అభియాన్'

పెందుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ పద్ధతిలో సాగు చేయాలని, తక్కువ మోతాదులో ఎరువులు వినియోగించాలని ఏడీఏ మాణిక్యమాంబ అన్నారు. మండలంలోని రాంపురంలో వ్యవసాయాధికారులు బుధవారం నిర్వహించిన 'ధర్తీ మాత బజావో అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేంద్రీయ పంటలను అధికంగా సాగు చేయాలన్నారు. నీటి వనరులు, భూమిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రావతి, మాజీ జడ్పీటీసీ రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

'ఉక్కు'లో రోడ్డు భద్రతపై కఠిన నిబంధనలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో రోడ్డు భద్రతపై యాజమాన్యం కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా నియమ, నిబంధనలు తూచా తప్పకుండా పాటించేలా అధికారులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ప్లాంట్ లోపల వాహనాలు కేవలం ముప్పై కిలోమీటర్ల వేగంతోనే వెళ్లాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలంలో నిబంధనలు ఉల్లంఘించిన వారికి అధికారులు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ఉద్యోగుల భద్రతపై రహదారి నియమాలు కఠినంగా అమలు చేయాలని యాజమాన్యం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పెందుర్తిలో వైసీపీ 55 వేల సంతకాల సేకరణ



సంతకాల పత్రాలను చూపుతున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన వైసీపీ కోటి సంతకాల సేకరణలో భాగంగా పెందుర్తి నియోజకవర్గంలో 55 వేల సంతకాలు సేకరించామని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తిలో ఉన్న వెలమభవన్‌లో బుధవారం కోటి సంతకాల సేకరణ పత్రాలను ప్రదర్శించారు. అనంతరం వాటిని పెట్టెల్లో పెట్టి అనకాపల్లి జిల్లాలో ఉన్న వైసీపీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. అనంతరం అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన సంతకాల సేకరణకు పెద్దఎత్తున ప్రజామద్దతు లభించిందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రైవేటీకరణ నిలుపుదల చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామన్నారు. అనంతరం పెందుర్తిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వాత్రింశతి నృసింహ దీక్షలు

సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింహాచలం క్షేత్రవైభవం వ్యాప్తికి ఉద్దేశించిన ద్వాత్రింశతి (32రోజుల) నృసింహదీక్షలు గురువారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం సింహగిరి ప్రధాన రాజగోపురానికి చేరువగా ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. అక్కడ స్వామి నమూనాను ఉంచి వైదికులు పూజలు చేసిన తరువాత దీక్షధారులకు తులసి మాలలు వేసి స్వామివారి రూపంతో కూడిన మాడలను అందజేసి అనంతరం అంతరాలయంలో దర్శనం కల్పిస్తారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 16న ధనుర్మాసోత్సవాలుప్రారంభించి, జనవరి 14వరకు నిర్వహించనున్నట్టు ఈవో సుజాత తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఆర్జిత సేవల్లో మార్పులుంటాయన్నారు. 16న మధ్యాహ్నం 1.01 గంటలకు నెలగంటతో ధనుర్మాసోత్సవాలకు శ్రీకారం చుడతారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తారు. ఈనెల 20 నుంచి 29 వరకు పగల్‌పత్ ఉత్సవాలు, ముక్కోటి ఏకాదశి, ధారోత్సవాలు, కనుమ పురస్కరించుకుని ఉదయం తిరువీధి నిర్వహిస్తారు. దీంతో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఈనెల 30 నుంచి జనవరి 9 వరకు రాపత్తు ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు రోజుకో అవతారంలో తిరువీధి నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనాలు లభిస్తాయి. జనవరి 11న కూడార్తై ఉత్సవంలో భాగంగా ఉదయం 9 నుంచి 10.30 వరకు దర్శనాలుండవు. ఈ నెల 16 నుంచి జనవరి 19 వరకు సుప్రభాతసేవ, ఆరాధన టికెట్ల విక్రయాలను రద్దుచేశారు. జనవరి 14 భోగి పండుగ రోజున సాయంత్రం 5 నుంచి 6.30 వరకు గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. దీంతో ఆ రోజు ఉదయం జరగాల్సిన ఆర్జిత నిత్యకల్యాణం సాయంత్రం జరుపుతారు. ఈనెల 30 నుంచి జనవరి 19 వరకు సహస్రనామార్చన రద్దుచేశారు.

ముస్సోరి శిక్షణకు జేసీ

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఐదురోజుల శిక్షణకు జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్వో కె.మయూర్ అశోక్‌హాజరుకానున్నారు. ఈనెల 12వ సాయంత్రం బయలుదేరుతారు. జేసీ, డీఆర్వో బాధ్యతలను హౌసింగ్ పీడీ సత్తిబాబుకు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

లోక్‌అదాలత్‌లో పెండింగ్ చలానాల సెటిల్‌మెంట్

మహారాణిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):లోక్ అదాలత్‌లో పెండింగ్ ట్రాఫిక్ చలానాలు సెటిల్ చేసుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జిల్లాలో జరగనున్న లోక్‌అదాలత్‌లో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలానాలను సెటిల్ చేసుకోవచ్చునని వివరించారు. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు అంతే కాకుండా క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, బ్యాంక్ రికవరీ, ఎక్సైజ్, మోటార్ యాక్సిడెంట్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు

కారు డ్రైవర్ ఆత్మహత్య



జగదీష్ (ఫైల్‌ఫొటో)

మధురవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని కారు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వాంబేకాలనీలో బుధవారం జరిగింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు... నొల్లి జగదీష్ (30) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య, ముగ్గురు పిల్లలతో వాంబేకాలనీలో ఉంటున్నాడు. మద్యానికి బానిసవడంతో తరచూ గొడవ పడతుండేవాడని, ఈ క్రమం లో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి యోగేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖతో అనుబంధం

నటనలో ఇక్కడే శిక్షణ తీసుకున్నా
తొలి చిత్రానికి ముగ్గురు అగ్ర హీరోల ఆశీస్సులు



- తాత, తండ్రి పేరు నిలబెడతా
- నటుడు కాకుంటే క్రికెటర్ అయ్యేవాడిని
- హీరో ప్రభాస్‌తోనే శంబాల చిత్రానికి క్రేజ్
- సినీ హీరో ఆది సాయికుమార్

డాబాగార్డెన్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : **ప్రేమకావాలి అంటూ...తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థానం సంపాదించి, లవ్‌లీ...శశి...అంటూ లవర్‌బాయ్‌గా అలరిస్తూనే...యాక్షన్, థ్రిలర్ జోన్స్ ద్వారా ఆకట్టుకుంటున్నారు హీరో ఆది సాయికుమార్. తాత ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టు పీజే శర్మ, ప్రముఖ హీరో, క్యారెక్టర్ ఆర్టిస్టు సాయికుమార్ కుమారుడిగా చిత్రరంగంలో దనదైన శైలిలో కొనసాగుతున్నారు. ఇటీవల తన జోనర్స్‌కు పూర్తి భిన్నంగా 'శంబాల' చిత్రంలో నటించారు. ఈ నెల 25న సినిమా విడుదల కానుందని, ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నగరానికి వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.**

విజయభాస్కర్ దర్శకత్వంలోని 'ప్రేమకావాలి' నా తొలి చిత్రం. మెగాస్టార్ చిరంజీవి , అక్కినేని నాగార్జున, నందమూరి బాలకృష్ణ సమక్షంలో ప్రారంభమవడం జీవితంలో మరిచిపోలేను. వారందరి ముందు తొలి షాట్‌తో సినిమా అరంగ్రేటం చేశా. వారి ఆశీస్సులతో పాటు తెలుగు ప్రేక్షకులు గుర్తించారు. మొదటి సినిమాతోనే స్టార్‌ఇమేజ్‌ను అందించారు.

విశాఖలోనే శిక్షణ

నటనలోని మెలకువలు విశాఖలోని స్టార్ మేకర్ ఎల్.సత్యానంద్ వద్ద తెలుసుకున్నా. ఇక్కడ చాలా ప్రాంతాల పేర్లు నాకు బాగా తెలుసు. నా ప్రతి చిత్రానికి విశాఖ రావడం సెంటిమెంట్‌గా మారింది. విశాఖ బీచ్‌ను చూస్తే రిలీఫ్‌గా ఉంటుంది.

తాత,తండ్రి పేర్లను నిలబెడతా

నటనలో తాత పీజే శర్మ, తండ్రి సాయికుమార్ పేరును నిలబెడతా. ఇప్పటివరకు 21 చిత్రాల్లో హీరోగా నటించా. కొన్ని చిత్రాలు ఆడలేదు. వాటి నుంచి చాలా తెలుసుకున్నా. శంబాలతో కెరీర్ నిలదొక్కుకుంటుందని నమ్ముతున్నా.

నాన్న ప్రత్యేకం..

నాన్న చిత్రాలు మరెవరూ చేయలేరని నా అభిప్రాయం. పోలీస్‌స్టోరీ, అంతఃపురంలోని ఆయన నటన సహజంగా ఉంటుంది. అంతఃపురంలోని అసలేం గుర్తుకురాదు.. పాటను రీమెక్ చేయాలని ఉంది. కృష్ణవంశీ దర్శకత్వంలోనే చేస్తా.

క్రికెటర్ అయ్యేవాడిని

హీరో కాకపోయి ఉంటే క్రికెటర్ అయ్యేవాడిని. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే చాలా ఇష్టం. హీరో కావాలని కాలేజీ రోజుల్లోనే నిర్ణయించుకున్నా. ఇప్పటికీ సీసీఎల్ ఇతర మ్యాచ్‌లు ఆడుతుంటా.

తెలుగుపై పట్టు



తాత, నాన్న, బాబాయ్‌లు తెలుగు గురువులు. వారి వద్ద పద్యాలు, పెద్దడైలాగ్స్ నేర్చుకున్నా. సాయికుమార్ నిర్వహించిన ప్రత్యేక షోలో వారిలో కలిసి భారీ డైలాగ్స్ చెప్పిన క్షణాలు మరిచిపోలేను.మాస్ మూవీస్‌లో నటించాలనుంది. ఆ తరహాలోనే చేయాలనుకుంటున్నా.శంబాల చిత్రానికి హైప్ రావడానికి డార్లింగ్ ప్రభాస్ అన్నే కారణం. టీజర్‌ను ఆయన విడుదల చేశారు. ప్రేక్షకులను కచ్చితంగా అలరిస్తుంది.ప్రస్తుతం శంబాల విడుదలకు సిద్ధంగా ఉంది. మరో మూడు సినిమాల్లో నటిస్తున్నా. వివరాలు త్వరలో చెబుతా.

గుల్బర్గా వర్సిటీపై ఏయూ విజయం

- సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ టీటీ పోటీలు

సాగర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న దక్షిణ మండల (సౌత్‌జోన్) అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ పోటీలలో బుధవారం గుల్బర్గా విశ్వవిద్యాలయం (కర్ణాటక) జట్టుపై ఏయూ జట్టు0-3 తేడాతో ఘనవిజయం సాధించింది. మంగళూరు విశ్వవిద్యాలయం (కర్ణాటక) జట్టుపై డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టు 3-0 స్కోరుతో విజయం సాధించింది. ఈనెల 11 న జరిగే ఫైనల్స్‌కు ఎంపిక య్యే జట్లు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారని గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.



గుల్బార్గా- ఏయూ క్రీడాకారుల మధ్య పోటీ

క్రైం... crime news

వైసీపీ కార్పొరేటర్, ఆమె తండ్రిపై దాడి

- అదే పార్టీకి చెందిన ఇద్దరు నేతలపై కేసు నమోదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ లావణ్య, ఆమె తండ్రి కృష్ణ

గాజువాక, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 58వ వార్డు వైసీపీ కార్పొరేటర్ లావణ్య, ఆమె తండ్రి కృష్ణలపై దాడి చేసిన ఇద్దరు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... మిందిలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే మల్లా విజయప్రసాద్ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. బయటకు వస్తున్న సమయంలో 58వ వార్డు కార్పొరేటర్ జి.లావణ్య తండ్రి కృష్ణతో వైసీపీ నాయకులు వంగ శ్రీను, సత్యనారాయణరెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో కార్పొరేటర్ లావణ్య, కృష్ణపై దాడిచేశారు. దీంతో వారు కిందపడిపోయారు. కార్పొరేటర్‌కు స్వల్ప గాయాలవగా, ఆమె తండ్రి కృష్ణ తలకు తీవ్రగాయం కావడంతో స్థానికంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని జింక మృతి



జూ సమీపంలో బస్సు ఢీకొని మృతిచెందిన జింక

ఆరిలోవ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొనడంతో జింక మృతి చెందింది. ఈ సంఘటన ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల సమీపంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి... కంబాలకొండ, సీతకొండలో వందలాది జింకలున్నాయి. తాగునీరు, ఆహారం కోసం నిత్యం ఇవి బయటి ప్రపంచంలోకి వస్తుంటాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం జూపార్కు సమీపంలోని జాతీయ రహదారిపైకి కొన్ని జింకలు వచ్చాయి. ఓ జింక రోడ్డు దాటుతుండగా అదే సమయంలో విజయనగరం వైపు వేగంగా వెళ్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో జింక అక్కడికక్కడే మృతిచెందింది. దానిని పోస్టుమార్టం నిమిత్తం జూ పార్కులోని ఆస్పత్రికి తరలించారు. కాగా జింకల ప్రాణాలు రక్షించేందుకు కంబాలకొండ చుట్టూ అటవీ శాఖాధికారులు ఎత్తైన కంచె ఏర్పాటు చేయాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.


మహిళా సాధికారితకు సహకరించేలా సరస్ ఎగ్జిబిషన్

- ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు
- 15వ తేదీ నుంచి 26 వరకు నిర్వహణ
- వివిధ రాష్ట్రాలకు చెందిన 250 సాళ్లు ఏర్పాటు
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్



ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వయం సాధికారితకు దోహదపడేలా సరస్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈనెల 15 నుంచి 26 వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తారన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ వస్తున్నందున నగరానికి ప్రజల రాకపోకలు అధికంగా ఉండడం, మెరుగైన రవాణా సదుపాయం, మార్కెటింగ్ అవకాశాలు విస్తృతంగా ఉంటాయన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని విశాఖపట్నాన్ని వేదికగా ఎంపిక చేశామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, వారి ఆదాయ వనరులు పెంపొందించడం, గ్రామీణ మహిళల జీవనోపాధిని బలోపేతం చేయడం ప్రదర్శన ప్రధాన ఉద్దేశమన్నారు. ఎగ్జిబిషన్‌లో ఏపీతో పాటు పలు రాష్ట్రాల స్వయంశక్తి సంఘాలకు చెందిన 600 మంది మహిళల ఆధ్వర్యంలో 250 స్టాళ్లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. చేనేత వస్త్రాలు, చీరలు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, వెదురు, లోహ, గాజు, చేతివృత్తులు, ఆర్గానిక్ ఉత్పత్తులు, మసాలాలు, గృహాలంకరణ వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. అదనంగా ఫుడ్‌స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులకు వినోదం కలిగించే ఆట పరికరాలు ఏర్పాటుచేశామన్నారు. పోలీస్ భద్రత, సీసీ కెమెరాల నిఘా, అగ్నిమాపక సదుపాయాలు, వైద్యసేవలు, తాగునీరు, మరుగుదొడ్లు , లైటింగ్ కల్పిస్తామన్నారు. ఎగ్జిబిషన్‌కు సెర్ప్, నాబార్డు, మెప్మా సంస్థలు, జాతీయ, ప్రైవేటు బ్యాంకులు, విశాఖ పోర్టుట్రస్ట్, ఇండియన్ ఆయిల్, గాయత్రి విద్యాపరిషత్ తదితర సంస్థలు సహాయం అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఎగ్జిబిషన్‌లో వస్తువులు కొనుగోలుచేయడం ద్వారా స్వయంశక్తి సంఘాలను ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



శిక్షణ పూర్తిచేసుకున్న నావికా పైలెట్లు



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న సంజయ్ భల్లా

సిరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హెలికాప్టర్ కన్వర్షన్ కోర్సు పూర్తి చేసుకున్న 16 మంది నావికా పైలట్లుకు ఐఎన్ఎస్ రాజలిలో పాసింగ్ పరేడ్ జరిగింది. కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా అవార్డులను ప్రదానం చేశారు. పట్టభద్రులైన పైలట్ల సేవలను నిఘా, శోధన, రెస్క్యూ, యాంటీ పైరసీ కార్యకలాపాలను చేపట్టే భారత నావికాదళంలో వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. 22 వారాల పాటు కఠోర శిక్షణలో భాగంగా వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి ట్రోఫీ, అవార్డులను అందజేశారు.

గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లకు పదోన్నతి



కృతజ్ఞతలు తెలియజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఇద్దరు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లకు పదోన్నతులు కల్పించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం పట్ల ఏపీ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.భవానీ, సెక్రటరీ జీవీఎస్ వరలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీ డాక్టర్ రాధారాణిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పదోన్నతులు పొందిన విజయభారతి, విజయలక్ష్మిలను ఆమె అభినందించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

- ఐటీ సెజ్ ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ హరేంధిరప్రసాద్



ఐటీ సెజ్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ కంపెనీల భూమిపూజ కార్యక్రమానికి ఈనెల 12న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఎక్కడా సమన్వయలోపం లేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేరుగా ఉండవిల్లి నుంచి ఐటీ హిల్‌లో హెలిప్యాడ్‌కు చేరుకుంటారని, అక్కడి నుంచి హరిత గృహసముదాయం పక్కన కాగ్నిజెంట్ క్యాంపస్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. ఆ తరువాత రోడ్డు మార్గంలో రుషికొండలోని ఏ-1గ్రాండ్‌లో జరగనున్న విశాఖ ఎకనమిక్ రీజియన్ సమీక్షా సమావేశంలో పాల్గొంటారని వివరించారు. కాగ్నిజంట్‌కు శంకుస్థాపన చేసే ప్రాంతంలో భద్రత పటిష్టం చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి భూమిపూజచేసే ప్రాంతం, అక్కడి నుంచి ఏ-1గ్రాండ్ వరకు రోడ్డులో గుంతలు లేకుండా చూడాలని, ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. అనంతరం సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి, జేసీ మయూర్ అశోక్‌తో కలిసి సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో సంగీత్‌మాథుర్, కాగ్నిజంట్, ఏపీఐఐసీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై ప్రత్యేక దృష్టిసారించి వసూళ్లను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం డీసీ(ఆర్) ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరో నాలుగు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులతో పాటు పాత బకాయిలను, నీటి చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని జోనల్లో తక్కువగా పన్ను వసూళ్లు చేస్తున్నారని, ప్రతిరోజు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించి రోజుకో సచివాలయం పరిధిలోని ఇండ్లను సందర్శించి పన్ను వసూలు చేయాలన్నారు. నగరంలో అదనంగా సౌకర్యం కేంద్రాలను ఏర్పాటు చేశామని, జోనల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ప్రతిరోజు ఈ కేంద్రాలను సందర్శించాలన్నారు. 98 వార్డుల్లోని సహాయక ఇంజనీర్లు (వాటర్ సప్లై) ఎనిమిటీ కార్యదర్శులు కలిపి పని చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్నులు చెల్లించేందుకు సీడీఎంఏ వెబ్‌సైట్ అందుబాటులో వున్నప్పటికీ, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మొండి బకాయిలపై దృష్టి సారించి ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకునేలా జోనల్ కమిషనర్ స్థాయిలో జప్తు నోటీసులు తయారుచేసి బకాయిదారుల భవనాల వద్ద నోటీస్ బోర్డులు పెట్టాలన్నారు. ఆస్తి పన్నులు విధించని భవనాలను గుర్తించాలన్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో జీరో టాక్స్ కలెక్షన్ అవుతోందని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటినీ సందర్శించి పన్ను వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో వార్డు సచివాలయం, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

